www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00




Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 11 | మంగళవారం | 11 ఆగస్టు, 2026



# విద్యార్థుల సమరభేరి!

## జార్ఖండ్ నియామక పరీక్షల్లో అవకతవకలపై ఉధృతమైన ఆందోళన

- అసెంబ్లీ ముట్టడికి యత్నం
- వందలాదిగా తరలివచ్చిన విద్యార్థులు
- బాష్పవాయువు, వాటర్ కేనన్లు, లాఠీచార్జితో అడ్డుకున్న పోలీసులు
- నేడు రాష్ట్ర బంద్‌కు బీజేపీ పిలుపు

జార్ఖండ్‌లో నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు చేస్తున్న ఆందోళనలు సోమవారం తీవ్రరూపం దాల్చాయి. అసెంబ్లీ ముట్టడికి వేలాది మంది నిరుద్యోగులు కదలడంతో పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించి, బాష్పవాయువు వదిలి, లాఠీచార్జి చేశారు. పలుచోట్ల బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పోలీసుల చర్యల్లో విద్యార్థులు, మహిళలు గాయపడారని ఆందోళనకారులు ఆరోపించగా.. రాళ్లదాడిలో 14 మంది పోలీసులు గాయపడ్డారు. నియామక పరీక్షల్లో అవకతవకల ఆరోపణలపై జార్ఖండ్ సీఐడీ మాజీ జేపీఎస్సీ చైర్మన్ ఎల్. ఖియాంగ్టేను అరెస్టు చేసింది. దీంతో ఈ కేసులో సీఐడీ అరెస్టు చేసిన వారి సంఖ్య 20కి చేరింది.

2

6

• వర్షాల కోసం..

# వరుణుడికి వేడుకోలు!

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వైభవంగా ముగిసింది. వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించిన యాగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ వద్ద కృష్ణా నది ఒడ్డున ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులతో 11 హోమగుండాలను ఏర్పాటు చేసి వరుణదేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు వైదిక విధానంలో హోమక్రతువులు నిర్వహించారు.

2

## నాగార్జునసాగర్‌లో వైభవంగా మహా వరుణయాగం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి

108 మంది రుత్వికులు.. 11 హోమగుండాలతో వైదిక క్రతువులు

కృష్ణా, గోదావరి నదులు నిండాలి.. ప్రాజెక్టులు జల కళ సంతరించుకోవాలి

చెరువులు, కుంటలు నిండాలి.. పంటలు పుష్కలంగా పండాలి

రాష్ట్రం సస్యశ్యామలం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రార్థనలు





## యూపీఐపై ఛార్జీ లేదు!

- వినియోగదారులకు ఎలాంటి రుసుము విధించం
- ఎండీఆర్‌పై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.. కొన్నింటికే పరిమితం
- చిరు వ్యాపారులకు మినహాయింపు
- 11 దేశాల్లో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్
- జులైలో రికార్డు స్థాయి లావాదేవీలు
- రాజ్యసభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

6



## మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు!

- గాజా ఒప్పందాన్ని తిరస్కరించిన ఇజ్రాయెల్
- హర్మూజ్‌పై ఇరాన్ పట్టు..
- శత్రు దేశాల నౌకలకు నో ఎంట్రీ
- ఎర్ర సముద్రంలో హౌతీల దాడులు

6

# క్లీన్ ఎనర్జీకి తెలంగాణే గ్లోబల్ హబ్!

క్లీన్ ఎనర్జీకి తెలంగాణే గ్లోబల్ హబ్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అనారు. ఇందులో భాగంగా సౌర, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునే అంశాలపై అమెరికా పర్యటనలో భాగంగా కీలక చర్చలు జరిపారు. భారత పునరుత్పాదక ఇంధన లక్ష్యాలు, తెలంగాణలో స్వచ్ఛ ఇంధన రంగ విస్తరణకు ఉన్న అవకాశాలపై పరిశోధకులు, నిపుణులు, అధికారులతో విస్తృతంగా చర్చించారు.

## సౌర, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారీ పెట్టుబడులే లక్ష్యం

2030 నాటికి 500 గిగావాట్ల లక్ష్యానికి వ్యూహాలపై సమాలోచన

• గ్రిడ్ ఆధునీకరణ, బ్యాటరీ నిల్వ, క్లీన్‌టెక్ తయారీపై ప్రత్యేక దృష్టి • యూసీ బర్క్‌లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక చర్చలు



ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగంలో అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా సౌర, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునే అంశాలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా కీలక చర్చలు జరిపారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్‌లీ (యూసీ బర్క్‌లీ)లోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలో ఉన్న ఇండియా ఎనర్జీ అండ్ క్లైమేట్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో భారత పునరుత్పాదక ఇంధన లక్ష్యాలు, తెలంగాణలో స్వచ్ఛ ఇంధన రంగ విస్తరణకు ఉన్న అవకాశాలపై పరిశోధకులు, నిపుణులు, అధికారులతో విస్తృతంగా చర్చించారు. భారత్ 2030 నాటికి 500 గిగావాట్ల నాన్–ఫాసిల్ ఇంధన సామర్థ్యాన్ని సాధించేందుకు అవసరమైన వ్యూహాలపై సమావేశంలో చర్చించారు. పునరుత్పాదక ఇంధన సాంకేతికతల తరువాయి 2లో..

## నో కాంప్రమైజ్!



- విద్యార్థుల ఆందోళన, పోలీసుల చర్యలు, అయోధ్య రామాలయ విరాళాల దోపిడీపై చర్చ జరగాల్సిందే
- పార్లమెంట్‌లో పట్టువీడని కాంగ్రెస్
- మూడు వారాలుగా కొనసాగుతున్న ప్రతిష్టంభన
- విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమన్న కేంద్రం
- షా సమాధానానికి హామీ
- ప్రధాని సమాధానం తప్పనిసరి అంటున్న ప్రధాన ప్రతిపక్షం

6

## ధరణిని బంగాళాఖాతంలో కలిపాం!

- భూ భారతితో భూములకు సంపూర్ణ భద్రత, భరోసా
- ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి 'భూధార్' ఇస్తాం
- రాష్ట్రవ్యాప్తంగా 180 తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల నిర్మాణం పూర్తి
- రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి రూ.600 కోట్లు మంజూరు
- రైతును రాజు చేయడమే లక్ష్యం: పొంగులేటి

2







# విద్యార్థుల సమరభేరి!

- జార్ఖండ్ నియామక పరీక్షల్లో అవకతవకలపై ఉధృతమైన ఆందోళన
- అసెంబ్లీ ముట్టడికి యత్నం
- బాష్పవాయువు, వాటర్ కేనన్లు, లాఠీచార్జితో అడ్డుకున్న పోలీసులు
- నేడు రాష్ట్ర బంద్‌కు బీజేపీ పిలుపు

**రాంచీ:** జార్ఖండ్‌లో నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు చేస్తున్న ఆందోళనలు సోమవారం తీవ్రరూపం దాల్చాయి. అసెంబ్లీ ముట్టడికి వేలాది మంది నిరుద్యోగులు కదలడంతో పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించి, బాష్పవాయువు వదిలి, లాఠీచార్జి చేశారు. పలుచోట్ల బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పోలీసుల చర్యల్లో విద్యార్థులు, మహిళలు గాయపడ్డారని ఆందోళనకారులు ఆరోపించగా.. రాళ్లదాడిలో 14 మంది పోలీసులు గాయపడ్డారని రాంచీ ఎస్ఎస్పీ తెలిపారు. నియామక పరీక్షల్లో అవకతవకల ఆరోపణలపై జార్ఖండ్ సీఐడీ మాజీ జేపీఎస్సీ చైర్మన్ ఎల్. ఖియాంగ్టేను అరెస్టు చేసింది. దీంతో ఈ కేసులో సీఐడీ అరెస్టు చేసిన వారి సంఖ్య 20కి చేరింది. రాంచీ, పలామూ, హజారీబాగ్, బొకారో, ధన్‌బాద్ జిల్లాల్లోని 18 ప్రాంతాల్లో ఇప్పటికే సోదాలు నిర్వహించింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగాన్ని నిరసిస్తూ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి అర్ధరాత్రి వరకు రాష్ట్రవ్యాప్త బంద్‌కు బీజేపీ పిలుపునిచ్చింది. వందలాది మంది విద్యార్థులు గాయపడ్డారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిత్య సాహు ఆరోపించారు.

### రంగంలోకి ఈడీ

జేఎస్ఎస్‌సీ–సీజీఎల్ సహా పలు నియామక పరీక్షల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న ఆర్థిక అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ దర్యాప్తు ప్రారంభించింది. ఆర్థిక అక్రమాలకు సంబంధించిన ఆధారాలు లభించడంతో ఈడీ విచారణకు ప్రభుత్వం అంగీకరించిందని ఉన్నత విద్యాశాఖ మంత్రి సుదివ్య కుమార్ తెలిపారు.

### చర్చలతో పరిష్కరించాలి: సోరెన్

విద్యార్థులకు తమ సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేసే హక్కు ఉందని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అన్నారు. వారి డిమాండ్లను అత్యంత సీరియస్‌గా, సున్నితంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు విద్యార్థులను తప్పుదోవ పట్టించవద్దని సూచించారు. పరీక్షల వ్యవస్థను మరింత పారదర్శకంగా, సాంకేతికత ఆధారంగా, సురక్షితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

### విషమంగా ఆందోళనకారుడి ఆరోగ్యం

తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జేఎల్‌కేఎం నేత దేవేంద్రనాథ్ మహతో ఆరోగ్యం క్షీణించింది. రక్తంలో చక్కెర స్థాయి భారీగా పడిపోవడంతో రాంచీ సదర్ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. అయినప్పటికీ ఆయన అంబులెన్స్‌లోనే ఆందోళనకు చేరుకుని స్ట్రెచర్‌పై నుంచి నిరసనకారులను ఉద్దేశించి ప్రసంగించారు.

# డీజిల్‌లో ఇథనాల్‌కు బ్రేక్!

**న్యూఢిల్లీ:** డీజిల్‌లో ఇథనాల్‌ను కలిపి వినియోగించే ప్రతిపాదనకు భద్రతాపరమైన అడ్డంకి ఏర్పడింది. ఇథనాల్ కలపడంతో డీజిల్ ఫ్లాష్ పాయింట్ గణనీయంగా తగ్గిపోయి, నిర్దేశిత భద్రతా ప్రమాణాలను అందుకోలేకపోయిందని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్లమెంట్‌కు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు తమ పరిశోధన కేంద్రాలతోపాటు గుర్తింపు పొందిన ప్రయోగశాలలు, వాహన తయారీ సంస్థల సహకారంతో ఇథనాల్ మిశ్రమ డీజిల్‌పై విస్తృతంగా పరీక్షలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. వివిధ స్థాయిల్లో ఇథనాల్‌ను కలిపి పరీక్షించగా.. ఇంధనం నిర్దేశిత ఫ్లాష్ పాయింట్ ప్రమాణాలను అందుకోలేదని వెల్లడించారు. ఫ్లాష్ పాయింట్ తగ్గడం వల్ల ఇంధనం భద్రతకు సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున డీజిల్‌లో ఇథనాల్ మిశ్రమంపై ముందుకు వెళ్లే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం పెట్రోల్‌లో ఇథనాల్ కలపడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తోందని సురేశ్ గోపీ తెలిపారు. 20 శాతం ఇథనాల్ మిశ్రమ లక్ష్యాన్ని నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఆ పరిమితిని మరింత పెంచే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. అదేవిధంగా ఇసోబ్యూటనాల్‌ను ప్రస్తుతం డీజిల్‌లో కలపడం లేదని మంత్రి తెలిపారు.

### వంట ఇంధనంగానూ పరిశీలన

దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతున్న నేపథ్యంలో దాన్ని వంట ఇంధనంగా వినియోగించే అవకాశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని సురేశ్ గోపీ తెలిపారు. దీనివల్ల ఎల్పీజీ దిగుమతులపై దేశం ఆధారపడటాన్ని తగ్గించడంతోపాటు.. దేశంలో అందుబాటులో ఉన్న మిగులు ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

# స్పిన్ సమరానికి సర్ఫరాజ్ రెడీ!

- 17 కిలోలు తగ్గి మరీ టెస్టు జట్టులోకి రీఎంట్రీ
- గాలేలో తొలి టెస్టుకు సన్నద్ధం

**న్యూఢిల్లీ:** భారత టెస్టు జట్టులోకి సర్ఫరాజ్ ఖాన్ అనూహ్యంగా తిరిగి వచ్చాడు. గత ఏడాదిన్నర కాలంలో ఏకంగా 17 కిలోల బరువు తగ్గి ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకున్న అతడికి శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌లో అవకాశం లభించింది. సాయి సుదర్శన్ గాయం కారణంగా జట్టులో చోటు దక్కించుకున్న సర్ఫరాజ్.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు తీవ్రంగా శ్రమించాడు. టెస్టు జట్టులోకి పిలుపు రావడానికి కొద్ది రోజుల ముందే సర్ఫరాజ్ సోషల్ మీడియాలో తన పట్టుదలను చాటుకున్నాడు. ''నేను సరిపోకపోవచ్చు.. కానీ నా దగ్గర ఉన్నదంతా పెట్టి పోరాడతా'' అంటూ చేసిన పోస్టు అతడి సంకల్పాన్ని ప్రతిబింబించింది. న్యూజిలాండ్‌తో 2024లో జరిగిన సిరీస్‌లో వరుసగా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో విఫలమైన తర్వాత సర్ఫరాజ్ జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాతి కాలాన్ని తనను తాను మార్చుకునేందుకు ఉపయోగించుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన సమయంలో కాస్త బరువుగా ఉన్నాడంటూ విమర్శలు ఎదుర్కొన్న సర్ఫరాజ్.. గత ఏడాదిన్నరలో 17 కిలోల బరువు తగ్గాడు. ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు బ్యాటింగ్‌లోనూ తన లోపాలను సరిదిద్దుకున్నాడు.

# ఉత్తరాఖండ్‌లో భారీ వర్ష బీభత్సం

### చమోలీలో కొట్టుకు పోయిన వంతెన

**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చమోలీ జిల్లాలోని నీతి వ్యాలీ ప్రాంతాన్ని సోమవారం వరదనీరు ముంచెత్తింది. వరద ధాటికి ఓ వంతెన క్షణాల్లో కొట్టుకుపోగా.. పలువురు ప్రాణాలతో బయటపడ్డారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. భారీ వర్షాల కారణం గా నీతి వ్యాలీ ప్రాంతంలో ఉన్న నదిలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. లోతట్టు ప్రాంతాల వైపు ఆ వరదనీరు దూసుకొచ్చింది. నీటితో పాటు మట్టి, బురద, పెద్దపెద్ద బండరాళ్లు కొట్టుకువచ్చాయి. ఈ క్రమంలో వరద ప్రవాహం బలంగా ఢీకొట్టడంతో ఓ ఇనుప వంతెన కొట్టుకుపోయింది. వంతెనకు ఓ వైపున ఉన్న పలు వాహనాలు కొట్టుకుపోగా.. మరోవైపు ఉన్న ఓ ట్రక్కు, ఎస్యూవీ వాహనాదారు లు అప్రమత్తమై ప్రమాదం నుంచి తప్పించుకున్నా రు. ఈ ప్రకృతి వైపరీత్యాన్ని అక్కడే ఉన్న కొంత మంది వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా నిమిషాల వ్యవధిలోనే వైరల్‌గా మారాయి. కాగా, వంతెన కొట్టుకుపోవడంతో నీతి వ్యాలీ ప్రాంతానికి ప్రధాన పట్టణంతో రాకపోకలు నిలిచిపోయాయి.



# 56.6 కోట్ల మందికి ఉపాధి

- దేశంలో 5.5శాతం నిరుద్యోగ రేటు
- ఏడాదిలో 0.1 శాతం మాత్రమే తగ్గిన జాబ్‌లెస్ రేట్
- గ్రామీణ ప్రాంతాల్లో స్థిరం.. పట్టణాల్లో మెరుగుదల

**న్యూఢిల్లీ:** దేశంలో ఉద్యోగ మార్కెట్ ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో పెద్దగా విస్తరించకపోవడంతోపాటు క్షీణించలేదని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. ఈ కాలంలో నిరుద్యోగ రేటు 5.5 శాతంగా నమోదైంది. గతేడాది ఇదే కాలంలో ఇది 5.6 శాతంగా ఉంది. ఉద్యోగిత జనాభా నిష్పత్తి (డబ్ల్యూఆర్‌పీ) జూన్‌లో 51.4 శాతంగా నమోదై.. గత నెలతో పోలిస్తే మార్పులేకుండా ఉంది. జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) నిర్వహించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) ప్రకారం.. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు గతేడాది జూన్‌లో 7.1 శాతం ఉండగా.. ఈ ఏడాది జూన్‌లో 6.6 శాతానికి తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం నిరుద్యోగ రేటు దాదాపు స్థిరంగా ఉంది.

### 54.4 శాతంగా ఎల్ఎఫ్‌పీఆర్

దేశవ్యాప్తంగా లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ (ఎల్ఎఫ్‌పీఆర్) జూన్‌లో 54.4 శాతంగా ఉంది. గత నెలతో పోలిస్తే మార్పులేకపోగా.. 2025 జూన్‌లో నమోదైన 54.2 శాతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది. మహిళల ఎల్ఎఫ్‌పీఆర్ జూన్‌లో 32.7 శాతంగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఎల్ఎఫ్‌పీఆర్ ఏడాది వ్యవధిలో 35.2 శాతం నుంచి 36.6 శాతానికి పెరిగింది. పట్టణాల్లో మాత్రం 25.2 శాతం నుంచి 24.8 శాతానికి స్వల్పంగా తగ్గింది. 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వారిలో ఏప్రిల్–జూన్ కాలంలో సగటున 56.6 కోట్ల మంది ఉపాధిలో ఉన్నట్లు గణాంకాల మంత్రిత్వ శాఖ తెలిపింది. వీరిలో 40.2 కోట్ల మంది పురుషులు, 16.4 కోట్ల మంది మహిళలు ఉన్నారు. దేశవ్యాప్తంగా 5,59,673 మంది నుంచి సేకరించిన సమాచారంతో త్రైమాసిక అంచనాలను రూపొందించినట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది.

# నో కాంప్రమైజ్!

- విద్యార్థుల ఆందోళన, పోలీసుల చర్యలు, అయోధ్య రామాలయ విరాళాల దోపిడీపై చర్చ జరగాల్సిందే
- ఈ మూడింటిపై సమాధానం వచ్చేవరకూ ఆందోళన కొనసాగిస్తాం
- పార్లమెంట్‌లో పట్టువీడని కాంగ్రెస్
- మూడు వారాలుగా కొనసాగుతున్న ప్రతిష్టంభన
- విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమన్న కేంద్రం
- అమిత్ షా సమాధానానికి హామీ
- ప్రధాని సమాధానం తప్పనిసరి అంటున్న ప్రధాన ప్రతిపక్షం



**న్యూఢిల్లీ:** పార్లమెంట్‌లో మూడు వారాలుగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు సోమవారం కూడా ఫలించలేదు. విద్యార్థుల ఆందోళనలు, పోలీసుల చర్యలపై లోక్‌సభలో సమగ్ర చర్చకు సిద్ధమని, చర్చ అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇస్తారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ప్రకటించారు. అయితే అయోధ్య రామాలయ విరాళాల దోపిడీ ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాల్సిందేనని కాంగ్రెస్ స్పష్టం చేసింది. మూడు అంశాలపై చర్చ జరిగే వరకు తమ ఆందోళనను విరమించేది లేదని తేల్చిచెప్పింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ విద్యార్థులపై పోలీసుల కాల్పులకు ఎవరు ఆదేశాలు ఇచ్చారో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కాల్పులకు హోంమంత్రి ఆదేశాలు ఇచ్చి ఉంటే అందుకు బాధ్యత వహించాలని, తనకు తెలియకుండా జరిగి ఉంటే హోంమంత్రి పదవిలో కొనసాగేందుకు ఆయన అనర్హుడని వ్యాఖ్యానించారు. విద్యార్థులపై పోలీసుల చర్యలకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### ఏ ఒక్కదానిపై రాజీపడం

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కలిసి రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల ఆందోళన, పోలీసుల చర్యలు, అయోధ్య రామాలయ విరాళాల దోపిడీ ఆరోపణలపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని కోరారు. ఈ మూడు అంశాల్లో ఏ ఒక్కదాని పైనా రాజీ పడే ప్రసక్తే లేదని ఖర్గే స్పష్టం చేశారు.

### చర్చకు సిద్ధం.. షా సమాధానమిస్తారు

లోక్‌సభ బీఏసీ సమావేశం అనంతరం కిరెన్ రిజిజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న విద్యార్థులు, యువత ఆందోళనలు, పోలీసుల చర్యలపై పూర్తి స్థాయి చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. చర్చ ముగిసిన తర్వాత హోంమంత్రి అమిత్ షా అంశాలవారీగా సమాధానం ఇస్తారని వెల్లడించారు. ప్రతిపక్షాలు సభా కార్యక్రమాలను అడ్డుకోకుండా ప్రశాంతంగా చర్చలో పాల్గొని, హోంమంత్రి సమాధానాన్ని వినాలని కోరారు. హోంమంత్రి చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ రాహుల్ గాంధీ వెనక్కి తగ్గుతున్నారని విమర్శించారు. చర్చ కావాలని కోరుతూ.. చర్చకు అవకాశం వచ్చినప్పుడు దానిని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. చర్చ నుంచి పారిపోతున్నది ఎవరో ఇప్పుడు అందరికీ తెలుస్తుంది' అని వ్యాఖ్యానించారు.

### మూడు వారాలుగా స్తంభించిన సభ

జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో విద్యార్థుల నిరసన లు, నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, అయో ధ్య రామాలయ విరాళాల ఆరోపణలపై ప్రతి పక్షాల ఆందోళనలతో సభా కార్యక్రమాలు పలుమార్లు నిలిచిపోయాయి. సమావేశాలు ఈ నెల 13తో ముగియనున్న నేపథ్యంలో కీలకమైన మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు, విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లు వంటి వాటి భవితవ్యంపై సందిగ్ధత నెలకొంది.

# క్లీన్ ఎనర్జీకి తెలంగాణే గ్లోబల్ హబ్!

(మొదటిపేజీ తరువాయి)

వ్యయం క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో ఏర్పడుతున్న కొత్త అవకాశాలను పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, అధునాతన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థల అనుసంధానం, సమాన అవకాశాలతో కూడిన ఇంధన పరివర్తన వంటి అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

### హరిత ఇంధన నమూనా

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలను భట్టి విక్రమార్క సమావేశంలో వివరించారు. పారదర్శక హరిత విధానాల ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ సౌరశక్తితో పాటు ఇతర పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని వేగంగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేస్తూ సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపడుతున్న విధానాన్ని వివరించారు. పీఎం–కుసుమ్ పథకం ద్వారా రైతులకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించే కార్యక్రమాలపైనా వివరాలు వెల్లడించారు.

### క్లీన్‌టెక్ తయారీకి ప్రాధాన్యం

తెలంగాణలో 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్‌టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా ఇంధన రంగ అనుభవాలను తెలంగాణలో వినియోగించుకునే అవకాశాలపై చర్చించారు. స్వచ్ఛ ఇంధన రంగంలో సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడు లు, పరిశోధనలను సమన్వయం చేసి రాష్ట్రానికి కొత్త అవకాశాలను సృష్టించడంపై దృష్టి సారించా రు. ఈ సందర్భంగా విద్యుత్, రవాణా, పారిశ్రామిక రంగాలు, వాతావరణ స్థిరత్వానికి సంబంధించిన అంశాలపై సంయుక్త అధ్యయనాలు చేపట్టడంతో పాటు విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందించే అంశంపై యూసీ బర్కిలీ ప్రతినిధులతో చర్చించారు. రాష్ట్ర ఇంధన భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆర్థిక పోటీతత్వాన్ని పెంచేందుకు యూసీ బర్కిలీతో కలిసి పనిచేయ డానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# వర్షాల కోసం.. వరుణుడికి వేడుకోలు!

- నాగార్జునసాగర్‌లో వైభవంగా మహా వరుణయాగం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి
- 108 మంది రుత్వికులు.. 11 హోమగుండాలతో వైదిక క్రతువులు
- కృష్ణా, గోదావరి నదులు నిండాలి.. ప్రాజెక్టులు జల కళ సంతరించుకోవాలి
- చెరువులు, కుంటలు నిండాలి.. పంటలు పుష్కలంగా పండాలి
- రాష్ట్రం సస్యశ్యామలం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రార్థనలు



**ప్రజానావ, నల్లగొండ బ్యూరో:** రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వైభవంగా ముగిసింది. వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించిన యాగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ వద్ద కృష్ణా నది ఒడ్డున ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యం లో 108 మంది రుత్వికులతో 11 హోమగుండాలను ఏర్పాటు చేసి వరుణదేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు వైదిక విధానంలో హోమక్రతువులు నిర్వహించారు. యాగంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. దివ్యమైన ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన యాగంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలని, శ్రీశైలం, నాగార్జునసాగర్ సహా అన్ని ప్రాజెక్టులు జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని ప్రతి చెరువు, ప్రతి కుంట జలకళతో కళకళలాడాలని, భూగర్భ జలాలు పెరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పంటలు పుష్కలంగా పండాలని, రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలని, తెలంగాణ సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండాలని వరుణదేవుడిని ప్రార్థించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు.

### సంప్రదాయాలకు గౌరవం

భారతీయ సంస్కృతిలో వర్షాలు సమృద్ధిగా కురవాలని యాగాలు, యజ్ఞాలు, పూజలు నిర్వహించడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయమని ప్రభుత్వం పేర్కొంది. ఒకవైపు శాస్త్రీయ అంచనాలు, ప్రణాళికల ఆధారంగా ప్రభుత్వం ముందుకు సాగుతూనే.. వర్షాలు, వ్యవసాయం, ప్రకృతి, మానవ జీవితం మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించే సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వరుణదేవుడిని ప్రార్థించినట్లు తెలిపింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్‌నినో ప్రభావంతో ఈసారి రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ మహా వరుణయాగాన్ని నిర్వహించినట్లు పేర్కొంది.

### పాల్గొన్న ప్రముఖులు

వరుణయాగంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, పి.సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 'ధరణి'ని బంగాళాఖాతంలో కలిపాం!

- భూ భారతితో భూములకు సంపూర్ణ భద్రత, భరోసా
- రైతును రాజు చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజానావ, హనుమకొండ:** గత పాలకులు ఆర్భాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలను ఏర్పాటు చేసినప్పటికీ.. వాటికి అవసరమైన కార్యాలయాలు, మౌలిక సదుపాయాలు కల్పించలేదని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రూ.600 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 180 తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను యుద్ధప్రాతిపదికన నిర్మించి ఏడాదిలోపే పూర్తి చేసినట్లు వెల్లడించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి, కమలాపూర్ మండలం గూడూరులో సోమవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణిని బంగాళాఖా తంలో కలిపామని మంత్రి పొంగులేటి అన్నారు. భూభారతి ద్వారా రైతులకు పూర్తి భద్రత, భరోసా కల్పించేలా భూముల ప్రక్షాళన చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి.. మనిషికి ఆధార్ ఉన్నట్లే భూములకు 'భూధార్' అందించనున్నట్లు చెప్పారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి వివాదాలు లేని ఆస్తులను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భూభారతి కింద రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ–సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు, నాలుగు విడతల్లో వ్యవసాయ భూముల తోపాటు ఇతర ఆస్తులను సైతం మ్యాపులతో సహా నమోదు చేసి అందజేస్తామని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ఎలాంటి స్వార్థం లేకుండా పనిచేస్తున్నామని పొంగులేటి అన్నారు. రైతన్నల దీవెనలతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అన్నదాతను రాజు చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. గత రెండున్నరేళ్లలో రైతుల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. గతంలో సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు సరిపడా సామర్థ్యం లేకపోయినా.. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని పేర్కొన్నారు.

### బీఆర్ఎస్‌పై ఫైర్

రైతులకు సంకెళ్లు వేసి, 'వరి వేస్తే ఉరి' అన్న బీఆర్ఎస్ నాయకులే ఇప్పుడు ధాన్యం కొనుగోళ్లపై రాజకీయం చేస్తూ పాదయాత్రలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పొంగులేటి మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గత పాలన ప్రభావంతో ఇబ్బందుల్లో ఉందని, ఈ విషయాన్ని పదేపదే చెప్పడంలో ఎలాంటి సంకోచం లేదన్నారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకున్నవారే ఇప్పుడు గోబెల్స్ ప్రచారం చేస్తూ విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### తక్కువ నీటితో పంటలు వేయాలి

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలను సాగు చేయాలని పొంగులేటి విజ్ఞప్తి చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపికపై రైతులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అంతకుముందు హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలం గూడూరులో లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నిమ్స్‌లో చిన్నారులకు ఉచిత గుండె శస్త్ర చికిత్సలు

## డైరెక్టర్ ప్రొ. రాహుల్ దేవరాజ్



**ప్రజానావ, హైదరాబాద్:** గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు హైదరాబాద్‌లోని నిమ్స్ (నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొ. రాహుల్ దేవరాజ్ తెలిపారు. ఆగస్టు 13 నుంచి ఈ ప్రత్యేక శస్త్రచికిత్సలు ప్రారంభం కానున్నాయి. గత ఐదేళ్లుగా నిమ్స్‌లో ప్రతి ఏడాది ఈ ఉచిత గుండె శస్త్రచికిత్సల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నిమ్స్ కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ ప్రొ. అమరేశ్వర్ నేతృత్వంలో శస్త్రచికిత్సలు జరగనున్నాయి. లండన్‌కు చెందిన వైద్యులు, పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డా. రమణ తన్నుఘనేని, సాంకేతిక నిపుణుల బృందం సహకరించనుంది. అవసరాన్ని బట్టి చిన్నారులకు ప్రాధాన్యత కేటాయించి వాక్–ఇన్ విధానంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల అనంతరం శస్త్రచికిత్స అవసరమున్న చిన్నారులను గుర్తించి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారు.

### ముందస్తు అపాయింట్‌మెంట్ అవసరం లేదు

అర్హత ఉన్న చిన్నారుల తల్లిదండ్రులు ముందస్తు అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిన అవసరం లేదని నిమ్స్ అధికారులు తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య నిమ్స్‌లోని సీటీ సర్జరీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. గతంలో చేయించిన వైద్య పరీక్షల నివేదికలు, పాత వైద్య రికార్డులు అందుబాటులో ఉంటే వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు పంజాగుట్టలోని నిమ్స్ సీటీ సర్జరీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు.

# సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- మేడారంలో వనదేవతలకు మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు
- క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల పరిశీలన
- కలెక్టరేట్, పైలాన్ పనులు వేగవంతం చేయాలి
- నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యం
- ఇవ్వాలని అధికారులకుఆదేశం
- మంత్రి సీతక్క



**ప్రజానావ, ములుగు:** ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ములుగు జిల్లా మేడారంలో జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి సీతక్క సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత తాడ్వాయి మండలం మేడారంలోని శ్రీ సమ్మక్క–సారలమ్మ వనదేవతలను దర్శించుకున్న మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. మేడారం సమ్మక్క–సారలమ్మ గద్దెల సమీపంలో, ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులతో పాటు ఆలయ పీటీ బీమ్స్, క్యూ లైన్లు, మీడియా టవర్లు, గ్రానైట్ పనుల పురోగతిని పరిశీలించారు. ఆలయ ప్రాంగణం వెనుక భాగంలో ఏర్పాటు చేయనున్న నూతన క్యూ లైన్‌కు అవసరమైన ఏర్పాట్లు, ఇతర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవో కార్యాలయ పరిసరాలను కూడా పరిశీలించి, ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ములుగులో నిర్మిస్తున్న నూతన సమీకృత కలెక్టరేట్ భవనం, ఘట్టమ్మ వద్ద చేపడుతున్న పైలాన్ నిర్మాణ పనులను మంత్రి సీతక్క పరిశీలించారు. నూతన కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనుల పురోగతిని, పైలాన్ నిర్మాణ స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, పార్కింగ్ సదుపాయాలు, విద్యుత్ ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రత తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, సందర్శకులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటన సందర్భంగా మేడారం, కలెక్టరేట్ పరిసరాల్లో చేపడుతున్న ప్రతి పనిని సమన్వయంతో పూర్తి చేసి, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, డీపీఓ వెంకయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ ఈవో, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ సహకారంతో టీజీఎస్ ఆర్టీసీ భరోసా

- రోడ్డు ప్రమాదంలో అంగవైకల్యానికి గురైన డ్రైవర్ కుటుంబానికి రూ.50 లక్షల బీమా సాయం
- కష్టకాలంలో కొండంత అండగా ఆర్టీసీ–యూబీఐ భాగస్వామ్యం: ఎండీ వై. నాగిరెడ్డి




**ప్రజానావ, హైదరాబాద్:** విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడి శాశ్వత అంగవైకల్యానికి గురైన టీజీఎస్ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) సహకారంతో కొండంత అండగా నిలిచింది. యూబీఐ అందిస్తున్న ఉచిత ప్రమాద బీమా పథకం ద్వారా బాధిత డ్రైవర్ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది. కరీంనగర్ జిల్లా కోరుట్ల డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎండీ. మదార్ (స్టాఫ్ నంబర్ E323013) గత ఏడాది అక్టోబర్ 9న విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదానికి గురై తన కాలును పూర్తిగా కోల్పోయారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ఆయన శాశ్వత అంగవైకల్యానికి గురై మంచానికే పరిమితం కావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించే 'సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్' బాధిత కుటుంబానికి అండగా నిలిచింది. సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఆర్టీసీ ఉద్యోగులు యూబీఐ బ్రాంచీలలో ఖాతాలు తెరిచి రూపే కార్డులు పొందడంతో, ఖాతాకు అనుసంధానమైన ఉచిత ప్రమాద బీమా ప్రయోజనం బాధిత ఉద్యోగికి వర్తించింది. సోమవారం హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ వై. నాగిరెడ్డి, యూబీఐ సీజీఎం ఎం. రవీంద్రబాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్. సత్యనారాయణ బాబ్జిలతో కలిసి రూ.50 లక్షల విలువైన చెక్కును బాధిత డ్రైవర్ మదార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎండీ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులు తమ తప్పు లేకపోయినా రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడం లేదా శాశ్వత అంగవైకల్యానికి గురికావడం అత్యంత విచారకరమన్నారు. టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, ఆపదలో ఉన్న ఉద్యోగుల కుటుంబాలకు సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇలాంటి బీమా పథకాలు అత్యవసర సమయాల్లో బాధిత కుటుంబాలకు ఆర్థిక భద్రతతో పాటు ఆత్మస్థైర్యాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ ప్రమాద బీమా పథకం ద్వారా 27 మంది ఆర్టీసీ సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరిందని తెలిపారు. సంస్థ ఉద్యోగులకు విశేష సేవలు అందిస్తున్న యూనియన్ బ్యాంక్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సీహెచ్. వెంకన్న, ఎం. రాజశేఖర్, సాలమన్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, సీపీఎం ఉషాదేవితో పాటు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### బాధిత డ్రైవర్ ప్రమాద వివరాలు

కరీంనగర్ జిల్లా కోరుట్ల డిపోకు చెందిన డ్రైవర్ ఎండీ. మదార్ (స్టాఫ్ నంబర్ ఈ323013) 09.10.2025న బస్సు (టీఎస్02జెడ్ 0040)లో కోరుట్ల నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా తెల్లవారు జామున 4:15 గంటల సమయంలో కుకనూర్‌పల్లి వద్ద బ్రిడ్జిపై నిలిపి ఉంచిన లారీ (టీఎస్08యూఏ 4588)ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడి తన కాలును పూర్తిగా కోల్పోయారు. శాశ్వత అంగవైకల్యానికి గురై మంచానికే పరిమితం కావడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక, మానసిక సంక్షోభంలోకి వెళ్లింది.



# మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్‌కి వచ్చే పర్యాటకుల భద్రతకు చర్యలు

**ప్రజానావ, సిరిసిల్ల :** మిడ్ మానేరు బ్యాక్ వాటర్ ప్రాంతంలో పర్యాటకుల భద్రత కోసం చేపడుతున్న చర్యలను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పరిశీలించారు. పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం గోపాలరావు పల్లి గ్రామ శివారులోని మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సోమవారం జిల్లా ఎస్పీ పోలీసు అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాక్ వాటర్ పరిసరాల్లోని ప్రమాదకర ప్రాంతాల ను గుర్తించి, పర్యాటకులు ఆయా ప్రాంతాలకు వెళ్లకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, కుటుంబాలతో వచ్చే పర్యాటకుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు. పర్యాటకులు పోలీసుల సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, నీటి ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, సరదా విషాదంగా మారకుండా చూసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిబ్బంది ఉన్నారు.

# ఆటోడ్రైవర్లకు మద్దతుగా 12న టీఆర్‌టీయూ మహాధర్నా

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత
- పోస్టర్ విడుదల చేసిన టీఆర్ఎస్ నాయకులు




**ప్రజానావ, హైదరాబాద్ :** ఆటోడ్రైవర్లకు మద్దతుగా తెలంగాణ రక్షణ సేన ట్రేడ్ యూనియన్ (టీఆర్ టీయూ) ఆధ్వర్యంలో ఈనెల 12న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నారు. టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యే మహా ధర్నా పోస్టర్ ను సోమవారం పార్టీ ముఖ్య నాయకులు బంజారాహిల్స్ లోని పార్టీ ఆఫీస్ లో ఆవిష్కరించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో ఆటో డ్రైవర్ల జీవితాలను ఆగం చేసేలా రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా మహాధర్నాకు పిలుపునిచ్చామని టీఆర్ఎస్ నాయకులు ఎల్. రూప్ సింగ్, సయ్యద్ ఇస్మాయిల్ తెలిపారు. ఆటో డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున మహాధర్నాకు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

### ఆటో డ్రైవర్ల జీవితాలు ఆగం – రూప్ సింగ్

లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ ఆటో డ్రైవర్ల జీవితాలను ఆగం చేస్తోందని టీఆర్ఎస్ నేత రూప్ సింగ్ విమర్శించారు. ఫ్రీ బస్ వల్ల ఆటోడ్రైవర్ల ఉపాధికి గండి పడిందని, ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు ఏటా రూ.12 వేల సాయం చేస్తామని మాట ఇచ్చి దానిని నిలబెట్టుకోకపోవడంతో వారి జీవితాలు మరింత దుర్భరం అయ్యాయని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆటో డ్రైవర్లకు అన్యాయం జరగనిచ్చేది లేదని స్పష్టం చేశారు. వారికి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అండగా ఉంటారని చెప్పారు.

### అనాలోచిత నిర్ణయం – ఇస్మాయిల్

లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో ఎలక్ట్రిక్ ఆటోలు తెచ్చి ఆటో డ్రైవర్ల జీవితాలను రోడ్డున పడేస్తారా అని టీఆర్ఎస్ నేత ఇస్మాయిల్ ప్రశ్నించారు. ఇది కార్మికుల జీవితాలను బుగ్గి పాలు చేసే అనాలోచిత నిర్ణయమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నాటి నుంచి ఆటో డ్రైవర్ల జీవితాలు ఆగమయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్రీ బస్ కారణంగా 3 వందల మంది ఆటోడ్రైవర్లు ప్రాణాలు తీసుకున్నారన్నారు. వారికి ఇస్తామన్న 12 వేల రూపాయలు ఇవ్వకపోగా, ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. రేవంత్ సర్కార్ కార్మిక వ్యతిరేక నిర్ణయాలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆటో సంఘాలు, ఆటో యూనియన్ల నాయకులు పాల్గొనాలని కోరారు.

# వేములవాడ భీమన్నను దర్శించుకున్న ప్రముఖ సింగర్ మంగ్లీ

## శ్రీ భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు



**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని ప్రముఖ గాయని సత్యవతి రాథోడ్ (మంగ్లీ) దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు మంగ్లీకి ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ స్వామి, అమ్మవార్ల శేష వస్త్రంతో పాటు లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ పర్యవేక్షకులు పేరుక శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణమాసం ఏర్పాట్లపై ఈవో ప్రత్యేక దృష్టి



**ప్రజానావ, వేములవాడ:** శ్రావణమాసం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని అనుబంధ ఆలయాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఈవో ఎల్. రమాదేవి ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయాల్లో క్యూలైన్లు, దర్శనం, తాగునీరు, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాగుల పంచమి సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసి దర్శనం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవోలు నవీన్ కుమార్, రామ్ కిషన్ రావు, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నరేందర్, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

# కష్టపడిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు సముచిత గుర్తింపు

- అవకాశాలు ఆలస్యమైనా అన్యాయం జరగదు.. పార్టీ కోసం పనిచేసిన వారికి భవిష్యత్తులో తగిన ప్రాధాన్యం
- రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



**ప్రజానావ, కామారెడ్డి:** కాంగ్రెస్ పార్టీ కోసం ఏళ్ల తరబడి అంకితభావంతో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన అవకాశాలు లభిస్తాయని, అవకాశాలు కొంత ఆలస్యమైనా ఎవరికీ అన్యాయం జరగదని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. పార్టీని నమ్ముకుని కష్టకాలంలోనూ జెండాను మోసిన కార్యకర్తలను కాంగ్రెస్ ఎప్పటికీ విస్మరించదని స్పష్టం చేశారు. కామారెడ్డి పట్టణంలోని గోపాలస్వామి ఆలయం సమీపంలోని సొసైటీ కార్యాలయంలో కామారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా ఎన్నికైన గూడెం శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కామారెడ్డిలోని క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో నూతన చైర్మన్, డైరెక్టర్ల అభినందన సభ, సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహమ్మద్ అలీ షబ్బీర్ నూతన చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డితో పాటు డైరెక్టర్లను అభినందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో నాయకులు, కార్యకర్తల కృషి ఎంతో కీలకమైందని, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని అన్నారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచి, పార్టీ జెండాను మోసిన ప్రతి ఒక్కరినీ గుర్తించి తగిన గౌరవం, ప్రాధాన్యం కల్పించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని తెలిపారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని, కొంత ఆలస్యం కావచ్చేమో కానీ ఎవరికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని షబ్బీర్ అలీ అన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రైతుల సంక్షేమంతో పాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. "కాంగ్రెస్ అంటేనే రైతులు.. రైతులు అంటేనే కాంగ్రెస్" అని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేకమైన చరిత్ర ఉందని, రైతుల కష్టాలు, సమస్యలు తెలిసిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలా శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పీసీసీ జనరల్ సెక్రటరీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమా శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్, పండ్లరాజు, గుడుగుల శ్రీనివాస్, అజ్మత్, భరత్, ఎడ్ల రాజిరెడ్డి, రాజా గౌడ్, నవసిలాల్, రమేష్ గౌడ్, అంకం కృష్ణారావు, ఆశాబోయిన శ్రీనివాస్, గోనె శ్రీనివాస్, భూమని బాలరాజ్, రెడ్డి నాయక్, ఇంద్రసేనారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి, మాజీ ఎంపీపీ నర్సింగరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, పీఏసీఎస్ నూతన చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, నూతన డైరెక్టర్లు, సహకార సంఘం ప్రతినిధులు, రైతులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరి అరెస్ట్ - రిమాండ్

## రూ.30 లక్షలు డిమాండ్

**ప్రజానావ, వేములవాడ:** వ్యాపారులను బెదిరించి భారీగా డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరిని వేములవాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎగ్లాస్ పూర్ గ్రామానికి చెందిన దండు వినోద్ నాంపల్లికి చెందిన అజయ్ కలిసి అగ్రహారం శివారులో స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్న నీలం గురవయ్య అనే వ్యక్తిని బెదిరించి రూ.20 లక్షలు డిమాండ్ చేశారు. బాధితుడు రూ.50 వేల నగదు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. అలాగే మరో రైస్ మిల్ నిర్వాహకుడు బండ మల్లేశం బెదిరించి రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులను సాయినగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.50 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

# మానేరు గంగమ్మ తల్లికి పూజలు

**ప్రజానావ, గంభీరావుపేట:** పొంగిపొర్లుతున్న గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు గంగమ్మ తల్లికి బిజెపి నాయకులు సోమవారము పూజలు నిర్వహించారు. మండల బిజెపి అధ్యక్షుడు కోడె రమేష్ ఆధ్వర్యంలో మానేరు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిరిసిల్ల ఎమ్మెల్యే మాజీ మంత్రి కేటీఆర్ ఐదు కోట్లతో ఎగువ మానేరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని గొప్పలు చెప్పి హామీలు కురిపించారనీ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, నాయకులు స్వామి, నాగరాజు, బండ దేవయ్య, శ్రీనివాస్ చారి, రవీందర్ నాయక్, దేవా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, దేవేందర్ యాదవ్, ఎల్లం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో కదం తొక్కిన కార్మికులు



**ప్రజానావ, సిరిసిల్ల :** కార్మిక, రైతు, వ్యవసాయ ఉపాధి కూలీల చట్టాలు హక్కులను రక్షించుకోవడం కోసం ఐక్యంగా పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్ పిలుపునిచ్చారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ ఉపాధి కూలీల, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ కార్మిక చట్టాలు, హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానం నుండి అంబేద్కర్ చౌక్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి రాస్తారోకో కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్, జిల్లా నాయకులు అన్నల్దాస్ గణేష్, సూరం పద్మ, ఎలిగేటి రాజశేఖర్, గీస బిక్షపతి, దాసరి రూప, ఆడెపు రజిత, బూర శ్రీనివాస్, మల్యాల నరసయ్య, శ్రీరామ్ సదానందం, సిరిమల్ల సత్యం, గోవిందు లక్ష్మణ్, కోల శ్రీనివాస్, బేజుగం సురేష్, స్వర్గం శేఖర్, సావణ పెల్లి రాములు, గిరిబాబు, మల్లయ్య, ప్రభాకర్, నరేందర్, రాజెల్లయ్య, శ్రీధర్, కమలాకర్, రమేష్, శంకర్, బాలయ్య, లచ్చయ్య, సురేష్, రవీందర్, శ్రీనివాస్, పోచమల్లు వివిధ రంగాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



# మత్తడి దూకుతున్న ఎగువ మానేరు

**ప్రజానావ, గంభీరావుపేట:** ఈ ఏడు ప్రాంత రైతాంగ కళ ఫలించింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు ఆదివారం తెల్లవారుజాము నుండి మొదలైన పరవళ్ళు సోమవారం వరకు అదేవిధంగా మత్తడి దూకుతుంది. ప్రాజెక్టుకు ప్రధాన ఆధారమైన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం పల్వంచ, సిద్దిపేట జిల్లా కూడెల్లి వాగుల ద్వారా వస్తున్న వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. 31 ఫీట్ల ఎత్తున ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి మత్తడి దూకుతుంది. ఎగువన భారీ వర్షాలు ఇలాగే కురిస్తే మానేరు ఉగ్రరూపంగా పరవాళ్ళు తొక్కనుంది. మత్తడి దూకుతున్న ప్రాజెక్టును తహసిల్దార్ మారుతి రెడ్డి ఎస్సై శ్రీకాంత్ లు సందర్శించారు. మానేరు ప్రధాన రహదారిపై భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలతో ఏ క్షణానైనా ప్రాజెక్టు ఉగ్రరూపం దాల్చే అవకాశం ఉండడంతో రెవెన్యూ పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.




# జార్ఖండ్ ఆందోళనపై దృష్టి సారించాలి!

EDITORIAL

మొన్నటి వరకు నీట్ గొడవ ముగిసిం దనుకుంటే.. ఇప్పుడు జార్ఖండ్ గొడవ మొదలయ్యింది. ఇక్కడ ఉన్నది ఇండియా టమి ప్రభు త్వమే. సీఎం హేమంత్ సోరేన్ ప్రభుత్వం కూడా ఇందుకు బాధ్యత వహించాలి. అలాగే రాహుల్ డా దీనిపై సమాధానం చెప్పాలి. కేంద్రంలో హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని అంటున్న రాహుల్ ముందు జార్ఖండ్ వెళ్లి అక్కడి విద్యార్థులకు సమాధానం చెబితే బాగుండేది. పరీక్షలు ఏవైనా, ఎక్కడ లీకైనా పాలకులు బాధ్యత వహించాల్సిందే. కేంద్రంలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తరవాత, పరీక్షల సంస్కరణలకు ఎన్‌డిఎ సర్కార్ నడుం బిగించింది.

పరీక్ష ఏదైనా లీకులు సర్వ సాధారణం అవుతున్నాయి. పరీక్షలు రాసిన విద్యార్థులు నష్టపోతున్నారు. ఏడాదంతా కష్టపడి పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్ దెబ్బతింటోంది. కొందరు దగుల్బాజీలు కాసులకు కక్కుర్తి పడడంతో ఉజ్వల జీవితాన్ని విద్యార్థులు కోల్పోతు న్నారు. మొన్నటి వరకు నీట్ గొడవ ముగిసిం దనుకుంటే.. ఇప్పుడు జార్ఖండ్ గొడవ మొదలయ్యింది. ఇక్కడ ఉన్నది ఇండియా టమి ప్రభు త్వమే. సీఎం హేమంత్ సోరేన్ ప్రభుత్వం కూడా ఇందుకు బాధ్యత వహించాలి. అలాగే రాహుల్ డా దీనిపై సమాధానం చెప్పాలి. ంద్రంలో హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని అంటున్న రాహుల్ ముందు జార్ఖండ్ వెళ్లి అక్కడి విద్యార్థులకు సమాధానం చెబితే బాగుం డేది. పరీక్షలు ఏవైనా, ఎక్కడ లీకైనా పాలకులు బాధ్యత వహించాల్సిందే. కేంద్రంలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తరవాత, పరీక్షల సంస్కరణలకు ఎన్‌డిఎ సర్కార్ నడుం బిగించింది. నందన్ నీలేకన్ నేతృ త్వంలో నిపుణుల కమిటీని వేసింది. లీజ్ వీరులపై చర్యలు తీసుకు నేలా చట్టం తెచ్చింది. పదికోట్ల వరకు జరిమానా, పదేళ్ల వరకు జైలు శిక్ష విధించనున్నారు. ఇప్పుడు దీనిని ఉపయోగించి జార్ఖండ్ దోషుల పై తొలి చర్యకు ఉపక్రమించాలి. ఇందుకోసం రాహుల్ డా పట్టుబ ట్టాలి. వలం అమిత్ షా రాజీనామా చేయాలన్న రాజకీయ డిమాండ్ తో పార్లమెంట్‌ను అడ్డుకుంటూ విలువైన ప్రజాధనాన్ని వృధా చేస్తు న్నారు. పార్లమెంట్ నడవకుండా చేస్తున్నారు. దీనిపై ఇప్పటి ంద్రం చర్యలు తీసుకున్నందున, ఇక జార్ఖండ్‌పై రాహుల్ దృష్టిసారిస్తే మంచిది. మరోవైపు జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ప్రారంభించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర సిఐడి నమోదు చేసిన కేసు ఆధారంగా గత వారం ఇది ఎన్‌ఫో ర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు చేసింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు చేస్తున్న ఆందోళనల నేప థ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం, హేమంత్ సోరెన్ నేతృత్వంలోని జార్ఖండ్ ప్రభుత్వం నియామకాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవక లపై సిఐడి, ఇడి దర్యాప్తులకు అంగీకరించింది. విద్యార్థులతో జరిగిన సమావేశం అనంతరం మంత్రి సుదివ్య కుమార్ సోను మాట్లాడు తూ.. విద్యార్థులు లేవనెత్తిన డిమాండ్లలో దాదాపు 98 శాతం అంశాలను ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. 2023, 2025 సంవత్సరాలకు సంబంధించిన బ్యాక్‌లాగ్ నియామక పరీక్షలతో పాటు 14వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షను రద్దు చేయడానికి ప్రభు త్వం అంగీకరించిందని చెప్పారు. అయితే సర్వీస్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షను రద్దు చేయడం, అలాగే నియామక పరీక్షల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సిబిఐ దర్యాప్తు జరిపించాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించలేదు. మంత్రి సుదివ్య కుమార్ సోను ప్రకారం.. సీజీఎల్ పరీక్షను రద్దు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం ఏకపక్షంగా అంగీకరించలేదని తెలిపారు. ఈ పరీక్ష హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాల పరిధిలో నిర్వహించబడినందున, ప్రభుత్వం స్వయంగా దానిని రద్దు చేయలేదని వివరించారు. అయితే ప్రభుత్వం తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించిందన్న వాదనను నిరసన చేస్తున్న విద్యార్థులు తిరస్కరించారు. విద్యార్థులు ప్రభుత్వ ప్రతి పాదనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సోమవారం 'విధానసభ ఘెరావ్' నిర్వ హించనున్నట్లు ప్రకటించారు. తమ ప్రధాన డిమాండ్ అయిన సిబిఐ దర్యాప్తును ప్రభుత్వం అంగీకరించలేదని విద్యార్థి నాయకులు పేర్కొన్నా రు. తమ డిమాండ్లలో 98 శాతం నెరవేర్చామని ప్రభుత్వం చెప్పడం వాస్త వానికి విరుద్ధమని వారు ఆరోపించారు. 13 పరీక్షలను రద్దు చేయాలని తాము డిమాండ్ చేయగా, ప్రభుత్వం వలం మూడు పరీక్షలను మాత్రమే రద్దు చేసిందని ఓ విద్యార్థి నాయకుడు పేర్కొన్నారు. అవకతవకలపై వలం సిఐడి దర్యాప్తుపైనే ఆధారపడటాన్ని కూడా విద్యార్థి నాయకులు విమర్శిం చారు. గతంలో సిఐఇడిపై పలు విషయాల్లో 'కప్పిపుచ్చే ప్రయత్నాలు' చేసిందనే ఆరోపణలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. నియామక పరీక్ష ల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై నిజాలను వెలుగులోకి తీసుకు రావడానికి, బాధ్యులను గుర్తించడానికి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచార ణ అవసరమని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి తమ డిమాండ్లను శాంతి యుతంగా వివరించాలని విద్యార్థి నాయకులు సూచించారు. సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకల ఆరోపణలపై ఇడి రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధా న్యత సంతరించుకుంది. ఒకవైపు ప్రభుత్వం ఇడి, సిఐడి దర్యాప్తులకు అంగీకరించగా, మరోవైపు విద్యార్థులు మాత్రం సిబిఐ వంటి స్వతంత్ర దర్యాప్తు కోరుతూ తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకో వాల్సి ఉంది. అవకతవకు కారకులైన వారిని ఊచలు లెక్క బెట్టేలా చేయా లి. అప్పుడే వారికి న్యాయం జరుగతుంది. అలాగే ఇతరులకు తగిన గుణపాఠం కలిగేలా కొత్త చట్టం ద్వారా చర్యలు తీసుకోవాలి.

సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకల ఆరోపణలపై ఇడి రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధా న్యత సంతరించుకుంది. ఒకవైపు ప్రభుత్వం ఇడి, సిఐడి దర్యాప్తులకు అంగీకరించగా, మరోవైపు విద్యార్థులు మాత్రం సిబిఐ వంటి స్వతంత్ర దర్యాప్తు కోరుతూ తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకో వాల్సి ఉంది. అవకతవకు కారకులైన వారిని ఊచలు లెక్క బెట్టేలా చేయాలి. అప్పుడే వారికి న్యాయం జరుగతుంది. అలాగే ఇతరులకు తగిన గుణపాఠం కలిగేలా కొత్త చట్టం ద్వారా చర్యలు తీసుకోవాలి.

## వనపర్తి, పెబ్బేరు మురుగునీటి వ్యవస్థ ఆధునికీకరణకు రూ.29.20 కోట్లు

- వనపర్తి మున్సిపాలిటీకి రూ.20 కోట్లు.. పెబ్బేరుకు రూ.9.20 కోట్లు
- త్వరలో టెండర్ ప్రక్రియ ప్రారంభం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**ప్రజానావ, వనపర్తి:** వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీల్లో మురుగునీటి నిర్వహణ వ్యవస్థను ఆధునికీకరించేందుకు రూ.29.20 కోట్లతో సివరేజ్ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. త్వరలోనే ప్రాజెక్టులకు సంబంధిం చిన టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వనపర్తి పట్టణంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు పారిశుధ్యాన్ని మెరుగుపరిచేలా సివరేజ్ ప్రాజెక్టు చేపట్టాలని తాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి సంబంధిత అధికారులతో చర్యలు తీసుకుని ప్రాజెక్టులకు ఆమోదం కల్పించారని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) 2.0 కింద హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం) విధానంలో ఎల్‌ఎస్ కాంట్రాక్ట్ సిస్టమ్ ద్వారా ఈ ప్రాజెక్టుల ను చేపట్టనున్నట్లు వివరించారు. ఇందులో వనపర్తి మున్సిపాలిటీకి రూ.20 కోట్లు, పెబ్బేరు మున్సిపాలిటీకి రూ.9.20 కోట్లు కేటాయించి నట్లు తెలిపారు. ప్రాజెక్టుల ద్వారా ఇళ్లు, వాణిజ్య సముదాయాల నుంచి వెలువడే మురుగునీటిని శాస్త్రీయంగా సేకరించి, సివరేజ్ వ్యవస్థ ద్వారా తరలించి, శుద్ధి చేసి సురక్షితంగా నిర్వహించే సదుపాయాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. తద్వారా పట్టణ పారిశుధ్యం మెరుగుపడ టంతో పాటు ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు మేలు జరుగుతుం దని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, వనపర్తి నియోజకవర్గంలో పట్టణాభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేసి చట్టబద్ధత కల్పించాలి
- బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర
- ఉపాధి కల్పన, ఎంఎస్ఎంఈల అభివృద్ధికి అనుగుణంగా పన్ను సంస్కరణలు ఉండాలి
- సింగరేణి బొగ్గు గ్యాసిఫికేషన్‌పై కేంద్రం స్పష్టత ఇవ్వాలి




**ప్రజానావ, ఖమ్మం:** దళిత క్రైస్తవులకు పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత కల్పిస్తూ ఎస్సీ హోదా కల్పించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్‌మం తర్ వద్ద సోమవారం నిర్వహించిన మహాధర్నాలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేసి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని కోరారు. దళిత క్రైస్తవుల సమస్యపై తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా దళిత క్రైస్తవుల డిమాండ్‌కు మద్దతుగా నిలిచి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రవిచంద్ర విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా రాజ్యసభలో పన్నుల సవరణ బిల్లు–2026పై జరిగిన చర్చలో ఎంపీ రవిచంద్ర పన్ను సంస్కరణలపై పలు సూచనలు చేశారు. పన్ను సంస్కరణలు కేవలం పెట్టుబడులను ఆకర్షించడానికే పరిమితం కాకుండా ఉద్యోగాల సృష్టి, సాంకేతిక పరిజ్ఞాన బదిలీకి దోహదపడేలా ఉండాలని సూచిం చారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) ఎదుర్కొంటున్న కంప్లయన్స్ భారాన్ని తగ్గించాలని, తెలంగాణ వంటి పారిశ్రామికంగా ముందున్న రాష్ట్రాలకు పన్ను ప్రోత్సాహకాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని కేంద్రాన్ని కోరారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడిందని వివరించిన ఆయన, పన్నుల సవరణ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తోందని ప్రకటించారు. మరోవైపు రాజ్యసభలో బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులు, తెలంగాణలోని ఎంఎస్ఎంఈలకు అందుతున్న కేంద్ర ప్రభుత్వ మద్దతుపై ఎంపీ రవిచంద్ర అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రులు సమాధానాలు ఇచ్చారు. సింగరేణి సంస్థ నుంచి బొగ్గు గ్యాసిఫికేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు తమకు అందలేదని, అందువల్ల ఈ ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలోని ఎంఎస్ఎంఈలకు పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ, క్రెడిట్ గ్యారెంటీ తదితర పథకాల ద్వారా ఆర్థిక సాయం, ప్రోత్సాహం అందిస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే స్పష్టం చేశారు.

# సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ నడపాలి

- బుల్లెట్ ట్రైన్ సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలి
- అసెంబ్లీలో అంశాన్ని లేవనెత్తాలి
- కీలక ప్రాంతంలో ఉన్న సూర్యాపేటను కారిడార్‌లో చేర్చాలి
- అఖిలపక్ష నాయకుల డిమాండ్
- కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేసిన బుల్లెట్ ట్రైన్ సాధన సమితి, అఖిలపక్ష నాయకులు



**ప్రజానావ, సూర్యాపేట:** హైదరాబాద్–చెన్నై బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను సూర్యాపేట మీదుగా కొనసాగించి, జిల్లా కేంద్రంలో ప్రత్యేక బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేయాలని బుల్లెట్ ట్రైన్ సాధన సమితి, సూర్యాపేట అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావుకు కోదాడలో వినతిపత్రం అందజేసి, సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని, ఈ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సూర్యా పేట జిల్లా కేంద్రం జాతీయ రహదారి–65పై హైదరాబాద్, విజయవాడ నగరాల మధ్య కీలక ప్రాంతంలో ఉందని తెలిపారు. పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేటను హైదరాబాద్–చెన్నై బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లో విస్మరించరాదని కోరారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని ఏర్పాటు చేసి జిల్లా కేంద్రంలో స్టేషన్ నిర్మిస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఉమ్మడి ఖమ్మం, వరంగల్ ప్రాంతాల ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనం కలుగుతుందని వివరించారు. బుల్లెట్ ట్రైన్ మార్గంలో సూర్యాపేటను చేర్చడం వల్ల ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. సూర్యాపేట ప్రజల చిరకాల డిమాండ్‌ను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేయాలని అఖిలపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావును కోరారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్ విషయంలో సూర్యాపేటకు ప్రాధాన్యం కల్పించేలా ప్రభుత్వాలపై రాజకీయంగా ఒత్తిడి తీసుకురావడంతో పాటు శాసనసభలో ఈ అంశాన్ని ప్రస్తావించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకిరెడ్డి, ముఖ్య సలహాదారు రమణాచారి, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు, మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకుడు పేర్ల నాగయ్య, కోదాడ సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్ట గనుపుల ముత్యాలు, జర్నలిస్టులు రాంబాబు, భూపతి రాములు, సీపీఐ నాయకులు కంబాల శ్రీను, మేకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## సిద్దిపేటలో రాముయ్య ముత్యాల తలంబ్రాల పంపిణీ

### భద్రాచల రామయ్య తలంబ్రాలు మహిమాన్వితమైనవి

**ప్రజానావ, సిద్దిపేట:** భద్రాచలం శ్రీ సీతారా ముల కల్యాణంలో ఉపయోగించే పవిత్ర ముత్యాల తలంబ్రాలు సోమవారం సిద్దిపేటలోని మార్కం డేయ దేవాలయానికి చేరుకున్నాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భద్రాచల రామయ్య కల్యాణ ముత్యాల తలంబ్రాలను భక్తులకు అందజేస్తున్న రామకోటి రామరాజు ఆధ్వర్యంలోని బృందం మార్కండేయ దేవాలయంలో తలంబ్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించింది. ముందుగా భక్తులతో భజనలు నిర్వహించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం భద్రాచల రామయ్య తలంబ్రాల పవిత్రత, విశిష్టతను భక్తులకు వివరించి ముత్యాల తలంబ్రాలను పంపిణీ చేశారు.



## యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ పనులు వేగవంతం చేయాలి

### జటప్రోలులో పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి జూపల్లి

**ప్రజానావ, నాగర్‌కర్నూల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి, కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడె న్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సోమవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడవద్దని అధికారులకు, కాంట్రాక్ట్ ప్రతినిధులకు సూచిం చారు. జటప్రోలు పాఠశాల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంట్రాక్ట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం మోటార్లు వెంటనే ఆన్ చేయాలి

- రైతుల ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా నీటి పంపింగ్ చేపట్టాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ
- మిడ్‌మానేరు నుంచి నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లు నింపాలి
- నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని డిమాండ్
- ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి సకాలంలో పంపింగ్ చేపట్టాలి
- ఆలస్యం చేస్తే రైతుల సాగు ప్రణాళికలకు నష్టం: హరీశ్‌రావు



**ప్రజానావ, సిద్దిపేట:** కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మోటార్లను తక్షణమే ఆన్ చేసి రిజర్వా యర్లను నింపాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన లేఖ విడుదల చేశారు. రైతుల సాగు ప్రయోజ నాలను దృష్టిలో ఉంచుకుని రాజకీయాలకు అతీతం గా వెంటనే నీటి పంపింగ్ ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత వానాకాలం పంట సీజన్‌లో ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొ నగా, మరోవైపు ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడంతో రైతులు తీవ్ర ఆందో ళనకు గురవుతున్నారని హరీశ్‌రావు లేఖలో పేర్కొన్నా రు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మిడ్‌మానేరు నుంచి మోటార్లను నడిపించి నీటిని పంపింగ్ చేయ డం ద్వారా అన్నపూర్ణ (అంతగిరి), రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, నృసింహ (బస్వాపూర్) తదితర రిజర్వాయ ర్లను నింపాలని డిమాండ్ చేశారు. ఆయా రిజర్వాయ ర్ల పరిధిలోని చెరువులు, చెక్‌డ్యామ్‌లను కూడా నింపి సుమారు నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. గత యాసంగి సీజన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని పై రిజర్వాయర్ల ఆయకట్టు కింద సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రస్తుత వానాకాలం పంటతో పాటు రానున్న యాసంగి సీజన్‌కు కూడా సాగునీరు అందించాలంటే ఇప్పటి నుంచే రిజర్వాయర్లను నింపాల్సిన అవసరం ఉందన్నారు. ఎగువ ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గోదావరిలో వరద నీటి లభ్యత ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. అందుబాటులోకి వచ్చే ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి సకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పంపులను నడపాలని సూచించారు. నీటి పంపింగ్‌లో ఆలస్యం జరిగితే రైతుల సాగు ప్రణాళికలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మిడ్‌మానేరు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 27 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 22 టీఎంసీల నీటి లభ్యత ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగితే గోదావరిలో మరింత నీటి లభ్యత ఏర్పడే అవకాశం ఉన్నందున, ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకుని మిడ్‌మానేరు నుంచి వెంటనే నీటిని పంపింగ్ చేసి దిగువ రిజర్వాయర్లను నింపాలని ఆయన కోరారు.

# రైతుల సంక్షేమం కోసమే మహా వరుణ యాగం

- రైతుల ఆనందం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలి
- మహా వరుణ యాగంతో రైతుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి వెల్లడి
- ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్




**ప్రజానావ, దేవరకొండ:** రైతుల సంక్షేమం కోసం రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లో ఆదివారం మహా వరుణ యాగం నిర్వహించినట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. ప్రస్తుతం వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో రైతులు కొంత ఇబ్బందులు ఎదు ర్కొంటున్న పరిస్థితి వాస్తవమేనని అన్నారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయానికి ప్రజాప్రతి నిధులుగా తమ పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండినప్పుడే రైతులు సంతోషంగా ఉంటారని, రైతుల ఆనందమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహా వరుణ యాగం నిర్వహించడం ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా ఉండటంతో పాటు రైతుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటుతోందని బాలునాయక్ అన్నారు. నాగార్జునసాగర్‌లో నిర్వహించిన మహా వరుణ యాగంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పాల్గొన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో వ్యవసాయ పనులు సాఫీగా సాగి, రైతులకు అనుకూల వాతావరణం ఏర్పడి పంటలు సమృద్ధిగా పండాలని ఆయన ఆకాంక్షించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు

**ప్రజానావ, సంగారెడ్డి :** ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పిలుపునిచ్చారు. జైల్ భరో కార్యక్రమంలో భాగంగా కొత్త బస్టాండ్ వద్ద సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జైల్ భరో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిం చారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా ఉద్యమించి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కర్రెగుట్టల్లో రాష్ట్ర పోలీస్ బాస్ పర్యటన

- దట్టమైన అడవిలో ఐదు గంటల పాటు డీజీపీ సీవీ ఆనంద్
- తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జాతీయ జెండా ఆవిష్కరణ
- సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపు, రహదారి పనుల పరిశీలన
- గొత్తికోయ కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ
- కర్రెగుట్టలను సందర్శించడం చరిత్రాత్మక ఘట్టం
- తెలంగాణలో మావోయిస్టుల ఉనికే లేదు: డీజీపీ సీవీ ఆనంద్





ప్రజానావ, వరంగల్ : ఒకప్పుడు మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని కర్రెగుట్టల ప్రాంతాన్ని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సోమవారం సందర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా ములుగు జిల్లాకు వచ్చిన డీజీపీ ఆదివారం రాత్రి ములుగు జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో బస చేసి, సోమవారం ఉదయం ములుగు నుంచి ఏటూరు నాగారం మీదుగా కర్రెగుట్టల ప్రాంతానికి చేరుకున్నారు. ముందుగా వెంకటాపూర్ మండలం పామునూరులోని సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపును సందర్శించిన ఆయన, అక్కడి గొత్తికోయ కుటుంబాలకు పోలీసు శాఖ తరపున నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం ఉదయం 9.25 గంటలకు పామునూరు సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపు నుంచి తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని తడపాల ప్రాంతానికి రోడ్డు మార్గంలో బయలుదేరారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఇటీవల నిర్మించిన మట్టి రహదారిపై సుమారు 35 కిలోమీటర్ల మేర ప్రయాణించి తడపాలకు చేరుకున్న డీజీపీ అక్కడ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి, శాంతికి చిహ్నంగా తెల్లటి పావురాలను, త్రివర్ణ రంగుల బెలూన్లను ఎగురవేశారు. సుదూర అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించి, అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దట్టమైన అడవిలో మధ్యాహ్నం 2.30 గంటల వరకు గడిపిన డీజీపీ, తిరుగు ప్రయాణం లోనూ అదే మార్గంలో ములుగుకు చేరుకున్నారు. వర్షాల కారణంగా రహదారులు అననుకూలంగా మారినప్పటికీ, ఎత్తుపల్లాలతో కూడిన మార్గాలు, పలు సెలయేరులను దాటుకుంటూ డీజీపీ కర్రెగుట్టల ప్రాంతానికి వెళ్లడం గమనార్హం. పామునూరు నుంచి తడపాల వెళ్లే మార్గంలో డీజీపీ కాన్వాయ్‌లోని ఓ వాహనం బురదలో దిగబడగా, అప్రమత్తమైన పోలీసులు వెంటనే వాహనాన్ని బయటకు తీసుకురావడంతో ప్రయాణం కొనసాగింది. డీజీపీ పర్యటన నేపథ్యంలో మురుమూరు నుంచి తడపాల వరకు దారి పొడవునా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గతేడాది అప్పటి డీజీపీ శశిధర్‌రెడ్డి హెలికాప్టర్ ద్వారా కర్రెగుట్టల ప్రాంతాన్ని సందర్శించగా, తాజాగా సీవీ ఆనంద్ రోడ్డు మార్గంలో కర్రెగుట్టలకు చేరుకున్న రాష్ట్ర పోలీస్ బాస్‌గా ప్రత్యేకత చాటుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ కర్రెగుట్టల ప్రాంతాన్ని సందర్శించడం చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. సుమారు 50 ఏళ్లుగా ప్రభుత్వ యంత్రాంగం నుంచి ఎవరూ ఈ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రయత్నించలేదని, ఇప్పుడు కర్రెగుట్టలపై జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఒకప్పుడు కర్రెగుట్టల ప్రాంతం నక్సల్స్ ప్రభావిత ప్రాంతంగా ఉండేదని, ప్రస్తుతం తెలంగాణలో మావోయిస్టుల ఉనికే లేదని స్పష్టం చేశారు. 2010 నుంచి రాష్ట్రంలో మావోయిస్టుల ఉనికి లేదని, కొంతకాలం క్రితం వరకు ఏటూరునాగారం సరిహద్దు ప్రాంతంలో వారి కదలికలు ఉన్నప్పటికీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలను కలిపి ప్రస్తుతం కేవలం 17 మంది మావోయిస్టులు మాత్రమే మిగిలి ఉన్నారని, వారిలో పలువురు లొంగిపోవడానికి ప్రయత్నిస్తున్నారని, సరైన మార్గం దొరకక కొంత సమయం పడుతోందని తెలిపారు. రాష్ట్రంలో లొంగిపోయిన మాజీ మావోయిస్టులపై పోలీసుల నిఘా కొనసాగుతోందని, లొంగిపోయిన వారెవరూ తిరిగి మావోయిస్టు కార్యకలాపాల్లోకి వెళ్లే ప్రయత్నం చేయడం లేదని చెప్పారు. మావోయిస్టు పార్టీ మాజీ కార్యదర్శి ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి బతికున్నారో లేదో తమకు స్పష్టమైన సమాచారం లేదని, ఆయనతో పాటు ఆయన భార్య, అనుచరుల ఆచూకీ కూడా తెలియడం లేదన్నారు. వారు ఎక్కడైనా ఉంటే త్వరగా లొంగిపోవాలని డీజీపీ సూచించారు. కేంద్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా చేపడుతున్న ఆపరేషన్ కగార్ నేపథ్యంలో మావోయిస్టుల కార్యకలాపాలు గణనీయంగా తగ్గిపోయాయని తెలిపారు. గతంలో మావోయిస్టుల ప్రభావం ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం అభివృద్ధి పనులు చేపట్టేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. డీజీపీ పర్యటనలో జిల్లా పోలీసు అధికారులు, సీఆర్పీఎఫ్ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## దశలవారీగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం

ప్రజానావ, రామగుండం: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 35వ డివిజన్ సప్తగిరి కాలనీ, రాజ్యలక్ష్మి కాలనీలలో దశలవారీగా అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నామని నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. సోమవారం 35వ డివిజన్‌లోని రాజ్యలక్ష్మి కాలనీలో రూ.7 కోట్ల స్పెషల్ ఫండ్ ప్యాకేజీ పనుల్లో భాగంగా రూ.8 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ జంగపల్లి రమాదేవి శ్రీనివాస్‌తో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తాను గెలిచిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు రాజ్యలక్ష్మి కాలనీ, సప్తగిరి కాలనీలు వర్షాకాలంలో ముంపునకు గురికాకుండా వరద నీటి కాలువ నిర్మాణం చేపట్టామని తెలిపారు. కొత్తగా ఏర్పడిన కాలనీలు కావడంతో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్లపై ప్రవహించేదని, ప్రస్తుతం డ్రైనేజీ నిర్మాణం పూర్తయిందని చెప్పారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ.50 లక్షల అంచనా వ్యయంతో రాజ్యలక్ష్మి కాలనీలో రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇటీవల డివిజన్‌లో వార్డు సందర్శన కార్యక్రమం నిర్వహించి స్థానిక సమస్యలను గుర్తించామని, ఒక్కొక్కటిగా అన్ని సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని మేయర్ మహంకాళి స్వామి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సాంబమూర్తి, డేవిడ్ రాజు, స్థానిక నాయకులు గడ్డం శ్రీనివాస్, పీచర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి చర్యలను ఖండించిన టీఎన్‌టీయూసీ

- రోడ్డు వెడల్పు పేరిట షాపులకు అనుమతులు
- నిర్మాణం పూర్తయ్యాక కూల్చివేతలా?
- బాధితులకు న్యాయం చేయాలి
- లేనిపక్షంలో ఆందోళన తప్పదు: నిమ్మకాయల ఏడుకొండలు



ప్రజానావ, రామగుండం: గోదావరిఖని చౌరస్తా, తిలక్‌నగర్, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లో అక్రమ కట్టడాల పేరుతో నిర్మాణాలను కూల్చివేయడాన్ని టీఎన్‌టీయూసీ నాయకులు నిమ్మకాయల ఏడుకొండలు తీవ్రంగా ఖండించారు. సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలన నడుస్తుందా? ప్రజా కంటక పాలన నడుస్తుందా? అనే విషయం అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు అభివృద్ధి పేరుతో నూతన నిర్మాణాలకు అనుమతులు ఇస్తూ, లబ్ధిదారులకు న్యాయం చేస్తామని చెబుతున్న అధికారులు.. మరోవైపు సింగరేణి యాజమాన్యం ఒక మాట, మున్సిపల్ అధికారులు మరో మాట, ప్రజాప్రతినిధులు మరో విధంగా వ్యవహరిస్తూ ప్రజలను, బాధితు లను, లబ్ధిదారులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని ఆరోపిం చారు. రోడ్డు వెడల్పు పేరుతో బాధిత షాపులకు అనుమతులు ఇచ్చి, నిర్మాణాలు పూర్తయిన తర్వాత అనుమతులు లేవంటూ కూల్చివే యడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ రాజకీయ క్రీడలకు స్వస్తి పలికి, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షం లో టీడీపీ, టీఎన్‌టీ యూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించా రు. అదేవిధంగా సింగరేణి క్వార్టర్ల పక్కన కార్మికుల పిల్లలు పెద్దవారైన తర్వాత రేకుల షెడ్లు నిర్మించుకుంటే వాటిని కూడా తొలగించాలని సింగరేణి యాజమాన్యం నోటీసులు ఇవ్వడం సరైన విధానం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. నిమ్మకాయల ఏడుకొండలు, జనరల్ సెక్రటరీ టి. మణిరామ్ సింగ్, పెద్దపల్లి పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు ముదుగంటి దామోదర్ రెడ్డి, టీఎన్‌టీయూసీ కోశాధికారి పెగడపల్లి రాజనర్సు, పెద్దపల్లి పార్లమెంట్ టీఎన్‌టీయూసీ ప్రచార కార్యదర్శి కొండి శ్రీనివాస్, రామగుండం ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు కామెర రాజబాబు, ఎస్సీ సెల్ కార్పొరేషన్ మాజీ కార్యదర్శి సుందిళ్ల స్వామి, టీఎన్ఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి బిక్కిం వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

Singareni news

## 12వ వేజ్ బోర్డు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి



ప్రజానావ, రామగుండం: దేశంలోని ప్రభుత్వ రంగ బొగ్గు గని కార్మికుల జీతాల పెంపు కోసం 12వ వేతన సవరణ కమిటీ (వేజ్ బోర్డు) ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, బొగ్గు పరిశ్రమల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయవద్దని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సింగరేణి ఆర్జీ–1 జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ నుంచి కొరిమి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ నుంచి ధర్మపురి, సీఐటీయూ నుంచి ఎస్. వీరయ్య, హెచ్ఎంఎస్ నుంచి దబ్బెట సతీష్ పాల్గొని మాట్లాడారు. దేశంలోని బొగ్గు గని కార్మికులకు అమలులో ఉన్న 11వ వేజ్ బోర్డు కాలపరిమితి జూన్ 30తో ముగిసిందని, 2026 జూలై 1 నుంచి 12వ వేజ్ బోర్డు అమల్లోకి రావాల్సి ఉన్నప్పటికీ కోల్‌ఇండియా యాజమాన్యం ఇప్పటివరకు వేజ్ బోర్డు ప్రక్రియను ప్రారంభించలేదని ఆరోపించారు. అనంతరం జాతీయ కార్మిక సంఘాల నాయకులు ఆర్జీ–1 జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో జాతీయ కార్మిక సంఘాల నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, తుమ్మల రాజిరెడ్డి, కె. సదానందంతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో జైలు బరో జయప్రదం

- నాలుగు లేబర్ కోళ్లు రద్దు చేయాలి
- స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి

ప్రజానావ/మంచిర్యాల : చెన్నూరు మండల కేంద్రంలో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ బరో కార్యక్రమం నిర్వహణలో భాగంగా రావి చెట్టు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం బస్టాండ్ దగ్గర రాస్తారోకో చేయడం జరిగింది. ఈ సందర్భంగా బోడంకి చందు రైతు సంఘం జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రజా, కార్మిక,రైతు వ్యతిరేక విధానాలు నశించాలని, స్వాతంత్ర ఉద్యమం కన్నా ముందు సాధించుకున్నా కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్ తీసుకువచ్చి కార్మికులకు కనీస హక్కులు లేకుండా చేస్తున్నారు. ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేస్తున్నారు, రైతుల విత్తన చట్టం, విద్యుత్ సవరణ చట్టాం రద్దు చేయాలని , మహాత్మ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కొనసాగించాలి, పంటలకు మద్దతు ధర కల్పించాలి, స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి, వ్యవసాయాన్ని రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే పని మానుకోవాలి. మధ్యాహ్నం భోజనం,ఆశ కార్మికులకు కనీస వేతనం జీవో అమలు చేయాలి. కార్మికులకు పెండింగ్ బిల్లులు వేతనాలు చెల్లించాలి. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించి, రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని, ఆదివాసులకు అటవీ హక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్మ పున్నం ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి, కావేరి రవి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు, శ్యామల ఉమారాణి మహిళా సంఘం జిల్లా కార్యదర్శి, కృష్ణమాచారి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు, సరోజ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు, కరింభీ మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు, ఎర్రోళ్ల సంజీవ్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, ప్రజాసంఘాల నాయకులు చంద్రన్న, సమ్మక్క, మల్లికార్జున్, మదనక్క, గట్టక్క, దుర్గక్క, విజయలక్ష్మి , సెగ్గం భూషయ్య, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి




ప్రజానావ, పెద్దపల్లి : కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం గా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యాడ్ నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం రాజీవ్ రహదారి పై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్, రైతు సంఘం జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ రెడ్డి లు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్ ను తెచ్చిందని వాటిని వెంటనే రద్దు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మార్చి గతంలో ఇచ్చే నిధులను తగ్గించి అందులో యంత్రాలతో పని చేయించు కోవచ్చు అనే నిబంధనలు తేవడం మూలంగా గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఉపశమనంగా ఉన్న 100 రోజుల పని నిర్వీర్యం అవుతుందని అన్నారు. విద్యుత్తు సంస్కరణల పేరుతో రైతులకు, గృహజ్యోతి వినియోగదారులకు తదితర పేద ప్రజలకు అందిస్తున్న ఉచిత కరెంటును రద్దు చేసే దుర్మార్గమైన 2025 విద్యుత్తు సవరణ చట్టం తెచ్చారని అన్నారు. రైతులకు నష్టం చేస్తూ కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా కొత్త నిబంధనలతో విదేశాల నుంచి ధాన్యాలను దిగుమతి చేసుకుంటున్నారని అన్నారు. దీనితో ఇక్కడ పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా పోతుందని అన్నారు. ఇప్పటికే గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచారని, వీటితో పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొం టున్నారని అన్నారు. ఇలాంటి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశ వ్యాప్తంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శులు జి జ్యోతి సీపెల్లి రవీందర్, తాండ్ర అంజయ్య, ఎండి ఖాజా, జిల్లా కమిటీ సభ్యులు రామలక్ష్మి , లచ్చయ్య, నాయకులు రాజమల్లు, భారతి, శ్రీనివాస్, నాగయ్య, దొడ్డ రాజబాబు, నరేష్, రమేష్, రామస్వామి, అంబాల లక్మన్, ఐఎఫ్టియు నాయకులు అశోక్, రాజేశం, తిరుపతి, లింగమూర్తి, బాలకృష్ణ, సృజన్ కార్మికులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17లోపు తెలంగాణ ఉద్యమకారుల హామీలు అమలు పరచాలి

- సిరిసిల్లలో తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజానావ, సిరిసిల్ల : సెప్టెంబర్ 17వ తేదీ లోపు తెలంగాణ ఉద్యమ కారుల హామీలను అమలు పరిచి వారికి ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారులు రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లో తెలంగాణ ఉద్యమ కారుల రౌండ్ టేబుల్ సమావేశం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజ్జెల దేవరాజ్ జరిగింది. ఈ సమావేశ ముఖ్య ఉదేశం తెలంగాణ రాష్ట్ర సాధనకోసం పోరాడిన తెలంగాణ ఉద్యమ కారులను ఉద్యమ కారులుగా గుర్తించి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలైన తెలం గాణ ఉద్యమ కారులకు 250 చదరపు గజాల స్థలం, రూ. 25 వేల పింఛన్, ఉచిత బస్ పాస్, కార్పొరేటివ్ ప్రైవేట్ ఆసుపత్రులలో కూడ ఉచిత వైద్యం అందిస్తూ సెప్టెంబర్ 17 లోపు తెలంగాణ ఉద్యమ కారుల హామీలను అమలు పరిచి వారికి అందజేయాలని కోరారు.



## ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర

### ఘనంగా జాతీయ పతాక ఆవిష్కరణ

ప్రజానావ, పెద్దపల్లి : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద జాతీయ జెండా ఆవిష్కరణను బిజెపి శ్రేణులు ఘనంగా జరిపాయి. బీజేపీ పట్టణ అధ్యక్షులు పెంజర్ల రాకేష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రిటైర్డ్ ఆర్మీ అధికారి మేకల విజయ్ కుమార్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించా రు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను చేతబూని భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతిఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను ప్రోత్సహించడమే హర్ ఘర్ తిరంగా యాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా జాతీయ జెండాపై గౌరవం, దేశభక్తి భావనను ప్రతి కుటుంబంలో పెంపొందించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శివంగరి సతీష్, తిరంగా యాత్ర కో–కన్వీనర్ కావేటి రాజగో పాల్, బెజ్జంకి దిలీప్, గుడ్ల సతీష్, మహంత కృష్ణ, బొడ్డుపల్లి కుమార్, అఖిల్, మధుకర్, హరీష్, పోగుల రాజు, మంతెన కృష్ణ, మహేష్, శ్రావణ్, రమేష్, శివసాయి, సురేష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ జాతీయ జెండా దేశభక్తిని పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు తంగేడ రాజేశ్వర్ రావు, తాళ్ల లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి మామిడి ఉమేష్, ముంజ రాజేంద్రప్రసాద్, పడాల నరసయ్య, చింతపండు స్వామి, దండు చంద్రయ్య, గుంటుకు సది, మేడగొని శివయ్య, యువ మోర్చా అధ్యక్షులు రెడ్ల వేణు, ముత్యం సాగర్, ముసారి రవి బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జైల్‌భరోతో దద్దరిల్లిన కామారెడ్డి

- కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా భారీ ప్రదర్శన.. అడుగడుగునా అరెస్టులతో ఉద్రిక్తత
- అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు: సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

ప్రజానావ, కామారెడ్డి: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక నియమావళిని రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి రైతులు, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ నాయకులు, కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. జైల్‌భరో కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు అడుగడుగునా అరెస్టు లు చేపట్టడంతో కామారెడ్డి జిల్లా కేంద్రంలో కొంత సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింహులు, ముదాం అరుణ్‌తో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్ర శేఖర్ మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తున్న నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం సరికాదన్నారు. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త నర్సింహులు, కార్యదర్శి వెంకటి, సీఐటీయూ నాయకులు రాజనర్సింహ, ముదాం అరుణ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్ల మోహన్, మున్సిపల్ యూనియన్ నాయకులు మహబూబ్, నర్సింగరావు, సంతోష్, దీవెన, శివ, రాజవ్వ, అంగన్వాడీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబాయమ్మ, ఇందిర, లక్ష్మి , ఆశా యూనియన్ నాయకులు రాజశ్రీ, మమత, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు బాలనర్సు, మాచారెడ్డి బాలనర్సు, స్వామి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



## సీపీఐ ప్రజా పాదయాత్ర వాల్ పోస్టర్ విడుదల

### ప్రజా సమస్యలపై పోరాటానికి పాదయాత్రలు: కందుకూరి రాజారత్నం

ప్రజానావ, రామగుండం: ఆర్జీ–2 ఏరియా 8వ కాలనీలోని ఏఐటీయూసీ యూనియన్ కార్యాలయంలో సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రజా పాదయాత్ర వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కందుకూరి రాజారత్నం మాట్లాడుతూ.. దేశంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర ధరల పెరుగుదలతో పాటు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ ప్రజా పోరాటాలకు శ్రీకారం చుట్టిందని, ప్రజా సమస్యలను వివరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలోనూ ప్రజా పాదయాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రానికి సీపీఐ ప్రజా యాత్ర జాత చేరుకోనుందని తెలిపారు. జాతను ప్రజలు ఆదరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ యాత్రలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని 8వ కాలనీలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కందుకూరి రాజారత్నం కోరారు. ఈ కార్యక్రమంలో ఆవుల రవికుమార్, నల్ల మదన్న, ఎం. మహేందర్, తాళ్లపల్లి నారాయణ, జాడి ఆంజనేయులు, సాగె కృష్ణ, అక్రమ్, సాంబన్న, అనిల్, రాయలింగు, గట్టయ్య, పోషం, నీలం మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అమిత్ షా రాజీనామా చేయాలి!

- అతనే దాడులకు ఆదేశిస్తే బాధ్యుడు.. తెలియకపోతే అసమర్థుడు
- మోదీ ప్రతిష్ఠ పునర్నిర్మించలేనంతగా దెబ్బతింది
- విద్యార్థులపై పోలీసుల 'క్రూర చర్యల'పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజం

**న్యూఢిల్లీ:** విద్యార్థుల ఆందోళనలపై పోలీసులు 'క్రూరంగా' వ్యవహరించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ఠ పూర్తిగా దెబ్బతిందని, దానిని ఇక పునర్నిర్మించలేరని వ్యాఖ్యానించారు. విద్యార్థులు, యువత కేంద్ర ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెడతారని అన్నారు.

## ఎవరు ఆదేశించారు?

జులై 20న దేశవ్యాప్తంగా వేలాది మంది యువత న్యాయమైన విద్యా వ్యవస్థ, ప్రశ్నపత్రాల లీకేజీలపై జవాబుదారీతనం కోరుతూ ఆందోళనకు దిగారని రాహుల్ గాంధీ తెలిపారు. ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగించడంతోపాటు మేకులతో కూడిన లాఠీలతో దాడి చేశారని, పెలెట్ గన్స్ కూడా ఉపయోగించారని ఆరోపించారు. బాలికలు, మైనర్లపైనా పోలీసులు దాడి చేశారని పేర్కొన్నారు. విద్యార్థులపై ఈ చర్యలకు ఎవరు ఆదేశించారని రాహుల్ ప్రశ్నించారు. ఢిల్లీ పోలీసు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో పనిచేస్తాయని గుర్తుచేశారు.

## యువత జవాబుదారీతనం సాధిస్తుంది

ప్రధాని మోదీ తన ప్రతిష్ఠను కాపాడుకునేందుకు ప్రచార యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. నిరసనల్లో పాల్గొన్న యువతను భయపెట్టేందుకు కేసులు, నిర్బంధాలు కొనసాగుతున్నాయని అన్నారు. 'యువత మేల్కొంది. మోదీ, షా లేదా మరే అధికారి అయినా తమ చర్యలకు సంబంధించిన పరిణామాల నుంచి తప్పించుకోలేరు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు మద్దతు తెలిపారు.

# ఈ వారంలోనే యూజీసీ-నెట్ కీ!

- జూన్ 2026 పరీక్ష ప్రొవిజనల్ కీ విడుదలకు ఎన్‌టీఏ సన్నాహాలు
- అభ్యంతరాలకు అభ్యర్థులకు అవకాశం

**న్యూఢిల్లీ:** యూజీసీ–నెట్ జూన్ 2026 పరీక్ష ప్రొవిజనల్ ఆన్సర్ కీని ఈ వారంలో అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. దీంతోపాటు సీఎస్ఐఆర్–నెట్, ఐకార్ ఏఐఈఈఏ (పీజీ), ఏఐసీఈ (పీహెచ్‌డీ) 2026 పరీక్షల కీని కూడా విడుదల చేయనుంది. కీపై అభ్యంతరాలు ఉంటే ఎన్‌టీఏ సూచించే గడువులో నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపింది. అభ్యంతరాల విధానం, ఫీజు, గడువు వివరాలను కీ విడుదల సమయంలో వెల్లడిస్తామని పేర్కొంది. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లోని సమాచారాన్నే నమ్మాలని సూచించింది. యూజీసీ–నెట్ పరీక్షలను జూన్ 22 నుంచి 30 వరకు ఆరు రోజులపాటు నిర్వహించగా.. హాజరు కాలేకపోయిన వారి కోసం జులై 5న రీటెస్ట్ నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, జేఆర్ఎఫ్, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. పేపర్–1లో 50, పేపర్–2లో సబ్జెక్టుకు సంబంధించిన 100 బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. జూన్ 2026 సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ పరీక్షను జులై 17, 18 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించారు. దీనికి సంబంధించిన ప్రొవిజనల్ ఆన్సర్ కీని కూడా ఎన్‌టీఏ త్వరలో విడుదల చేయనుంది.

# యూపీఐపై ఛార్జీ లేదు!

- వినియోగదారులకు ఎలాంటి రుసుము విధించం
- ఎండీఆర్‌పై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.. కొన్నింటికే పరిమితం
- చిరు వ్యాపారులకు మినహాయింపు
- 11 దేశాల్లో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్
- జూలైలో రికార్డు స్థాయి లావాదేవీలు
- రాజ్యసభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ:** యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా చెల్లింపులు చేసే వినియోగదారులపై ఎలాంటి ఛార్జీ విధించే ఆలోచన లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. భవిష్యత్‌లో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అమలు చేసినా.. నిర్ణీత పరిమితికి మించిన కొన్ని వర్గాల వ్యాపార లావాదేవీలకే అది వర్తిస్తుందని తెలిపారు. రోడ్డు పక్కన వ్యాపారులు, చిరు వ్యాపారులు నిర్వహించే తక్కువ విలువైన లావాదేవీలు సహా అత్యధిక యూపీఐ లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని పేర్కొన్నారు. పన్నుల చట్టాల సవరణ బిల్లు–2026పై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చకు సీతారామన్ సమాధానమిచ్చారు. అనంతరం బిల్లును రాజ్యసభ మూజువాణి ఓటుతో లోక్‌సభకు తిరిగి పంపింది. దీంతో బిల్లుకు సంబంధించిన పార్లమెంటరీ ప్రక్రియ పూర్తయింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్–2007లోని సెక్షన్ 10ఏను సవరించడమే బిల్లు ఉద్దేశమని మంత్రి వివరించారు. ఈ సవరణ ద్వారా ప్రభుత్వం కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలను ఛార్జీల నుంచి మినహాయించేలా నోటిఫై చేసే అధికారం పొందుతుందని చెప్పారు. అంతేతప్ప వినియోగదారులపై పన్ను లేదా లావాదేవీ ఛార్జీ విధించే ప్రతిపాదన లేదని స్పష్టం చేశారు. బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించిన తర్వాత ఎన్‌పీసీఐ ఆధ్వర్యంలోని యూపీఐ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ ఎండీఆర్ అవసరమా? ఉంటే ఏయే లావాదేవీలకు వర్తింపజేయాలి? విధానం ఎలా ఉండాలి? అనే అంశాలను నిర్ణయిస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి ఎండీఆర్ విధానం ఖరారు కాలేదని పేర్కొన్నారు.

## రూ.29.9 లక్షల కోట్ల లావాదేవీలు

దేశంలో యూపీఐ వినియోగం భారీగా పెరుగుతోం దని సీతారామన్ తెలిపారు. 2026 జూలైలో దేశవ్యాప్తంగా 2,366 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయని, వాటి మొత్తం విలువ రూ.29.9 లక్షల కోట్లు అని వెల్లడించారు. 2016లో ప్రారంభమైన యూపీఐ ప్రస్తుతం 11 దేశాల్లో అందుబాటులో ఉందన్నారు. పీఎం స్వనిధి పథకం లబ్ధిదారులు, రోడ్డు పక్కన వ్యాపారులు, ఇతర చిరు వ్యాపారులే యూపీఐ విస్తృతికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.

## విపక్షాల ఆరోపణలపై ఆగ్రహం

యూపీఐ ప్రారంభమైన సమయంలో దాని విజయం పై మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం, ఆయన సహచరులు సందేహాలు వ్యక్తం చేశారని సీతారామన్ విమర్శించారు. అమెరికా ఒత్తిడి కారణంగానే యూపీఐపై ఛార్జీలు విధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న సీపీఐ(ఎం) సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపణలను ఆమె ఖండించారు. తన సమాధానం పూర్తిగా వినకుండానే ఆయన సభ నుంచి వెళ్లిపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వాస్తవాలను వక్రీకరించి ప్రజల్లో గందరగోళం సృష్టించవద్దని విపక్ష సభ్యులకు సూచించారు.

# బ్యాంకుల రుణాలకు భారీ 'రైట్‌ఆఫ్'!

దేశంలోని భారీ కంపెనీలు, సేవా రంగానికి బ్యాంకులు ఇచ్చిన రుణాల్లో దాదాపు రూ.9.95 లక్షల కోట్లను గత 12 ఆర్థిక సంవత్సరాల్లో రైట్‌ఆఫ్ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2018–19లో అత్యధికంగా రూ.1,48,753 కోట్ల రుణాలను రైట్‌ఆఫ్ చేయగా.. 2025–26లో ఆ మొత్తం రూ. 20,485 కోట్లకు తగ్గినట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి సోమవారం పార్ల మెంట్‌కు తెలిపారు. రుణాలను రైట్‌ఆఫ్ చేయ డం అంటే బ్యాంకుల బ్యాలెన్స్‌షీ ట్లను సర్దు బాటు చేసుకునే అకౌంటింగ్ ప్రక్రియ మాత్ర మేనని పంకజ్ చౌధరి స్పష్టం చేశారు. రైట్‌ఆఫ్ చేసినంత మాత్రాన రుణగ్రహీతలపై ఉన్న బకాయి బాధ్యతలు రద్దు కావని తెలిపారు. బకాయిలను తిరిగి రాబట్టేందుకు బ్యాంకులు చట్టపరమైన చర్యలు కొనసాగిస్తాయని పేర్కొన్నారు. 2025–26లో పెద్ద పరిశ్రమలు, సేవా రంగాలకు సంబంధించిన బ్యాంకు రుణ బకాయిలు రూ.69.21 లక్షల కోట్లకు చేరినట్లు మంత్రి వెల్లడించారు.

## తగ్గిన ఆర్థిక లోటు

దేశ ఆర్థిక పరిస్థితిపై కూడా కేంద్రం పార్లమెంట్‌కు వివరాలు వెల్లడించింది. కేంద్ర ఆర్థిక లోటు 2020–21లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 9.2 శాతం ఉండగా.. 2025–26లో 4.4 శాతానికి తగ్గినట్లు పంకజ్ చౌధరి తెలిపారు. ఇదే కాలంలో కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం గణనీయంగా పెరిగిందని చెప్పారు. 2020–21లో రూ.4.3 లక్షల కోట్లుగా ఉన్న మూలధన వ్యయం.. 2025–26లో రూ.10.7 లక్షల కోట్లకు చేరినట్లు వెల్లడించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం సగటున 2.1 శాతంగా నమోదైనట్లు మంత్రి తెలిపారు. ఆర్థిక లోటు తగ్గడం, మూలధన వ్యయం పెరగడం వంటి పరిణామాలతో దేశ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం కొనసాగుతోందని పేర్కొన్నారు.




# ఎయిరిండియా విమాన ఘటనపై దర్యాప్తు ముమ్మరం

- ఏఏఐబీకి బీఈఏ, ఎయిర్‌బస్ నిపుణుల సహకారం

**ముంబై/న్యూఢిల్లీ:** ఎయిరిండియా ఫుకెట్–ఢిల్లీ విమానంలో చోటుచేసుకున్న కుదుపు ఘటనపై దర్యాప్తుకు ఫ్రాన్స్ విమాన ప్రమాద దర్యాప్తు సంస్థ బీఈఏ, విమాన తయారీ సంస్థ ఎయిర్‌బస్ నిపుణుల బృందాలు సహకరించనున్నాయి. ఈ బృందాలు మంగళవారం ఢిల్లీకి చేరుకోనున్నాయి. ఆగస్టు 4న ఏఐ2379 విమానం ప్రయాణ సమయంలో ఒక్కసారిగా సుమారు 300 అడుగుల ఎత్తు కోల్పోయింది. అనంతరం నియంత్రణలోకి వచ్చి ఢిల్లీలో సురక్షితంగా ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఐకావో అనుబంధం–13 నిబంధనల ప్రకారం ఏఏఐబీ దర్యాప్తు చేపట్టింది. విమానంలో 137 మంది ప్రయాణికులు, ముగ్గురు చిన్నారులు సహా, 8 మంది సిబ్బంది ఉన్నారు. కొంతమంది ప్రయాణికులు, సిబ్బందికి గాయాలయ్యాయి. కాగా, పైలట్‌కు నిర్వహించిన ప్రాథమిక సైకోయాక్టివ్ పదార్థాల పరీక్షలో మరింత విశ్లేషణ అవసరమని తేలడంతో నిర్ధారణ పరీక్ష నిర్వహించారు. దాని ఫలితం కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.

# మణిపూర్ హింస కేసులకు ప్రత్యేక కోర్టులు!

- సీబీఐ, ఎన్ఐఏ దర్యాప్తు కేసులకు వేర్వేరుగా న్యాయస్థానాలు ఏర్పాటు చేయండి
- బాధితులకు చార్జిషీట్లు, కేసుల వివరాలు అందుబాటులో ఉంచాలి
- అసోం ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ:** 2023లో మణిపూర్‌లో చోటుచేసుకున్న జాతుల మధ్య హింసకు సంబంధించిన సీబీఐ, ఎన్ఐఏ కేసుల విచారణను వేగవంతం చేసేందుకు రెండు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఒక ప్రత్యేక కోర్టులో సీబీఐ కేసులు, మరో కోర్టులో ఎన్ఐఏ కేసులు మాత్రమే విచారించేలా చర్యలు తీసుకోవాలని మణిపూర్, అసోం ప్రభుత్వాలతో పాటు సంబంధిత అధికారులను సూచించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చీ, వి.మోహనలతో కూడిన ధర్మాసనం.. చార్జిషీట్లు దాఖలైన కేసుల సంఖ్య, కేసు నంబర్లు, విచారణ ప్రస్తుత స్థితి తదితర వివరాలను సమీకరించి కోర్టు ముందుంచాలని ఆదేశించింది. బాధితులు, వారి కుటుంబాలు, న్యాయవాదులు సంబంధిత పత్రాలను పొందేలా చూడాలని పేర్కొంది. ఈ అంశంపై తదుపరి విచారణ నాటికి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నివేదిక సమర్పించాలని ఆదేశించింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి తెలిపిన వివరాల ప్రకారం.. సీబీఐకి అప్పగించిన 31 కేసుల్లో 27పై తుది నివేదికలు దాఖలయ్యాయి. ఇందులో 22 చార్జిషీట్లు, 5 క్లోజర్ రిపోర్టులు ఉన్నాయి. మరో నాలుగు కేసుల దర్యాప్తు కొనసాగుతోంది. చార్జిషీట్లు దాఖలైన 22 కేసుల్లో 20 కేసులను కోర్టులు విచారణకు స్వీకరించగా.. రెండింటిపై నిర్ణయం పెండింగ్‌లో ఉంది. ఎన్ఐఏకు అప్పగించిన 30 కేసుల్లో 15 కేసులపై చార్జిషీట్లు దాఖలయ్యాయి. మిగిలిన 15 కేసుల దర్యాప్తు కొనసాగుతోంది. చార్జిషీట్లు దాఖలైన కేసుల్లో ఏడింటిపై ఇప్పటికే అభియోగాలు నమోదు చేసినట్లు ఎన్ఐఏ తరఫున కోర్టుకు తెలిపారు. 15 కేసుల్లో రెండు ఢిల్లీ, ఐదు గువాహటి, ఎనిమిది మణిపూర్ కోర్టుల్లో ఉన్నాయని వివరించారు.

## 200 మందికిపైగా మృతి

మణిపూర్‌లో 2023 మే 3న జాతుల మధ్య హింస చెలరేగింది. షెడ్యూల్డ్ తెగ హోదా కోసం మెయితీ వర్గం చేస్తున్న డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ కొండ ప్రాంతాల్లో నిర్వహించిన గిరిజన ఐక్యతా ర్యాలీ అనంతరం హింస ప్రారంభమైంది. ఆ ఘటనలో 200 మందికిపైగా ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గాయపడ్డారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

## అభిషేక్ బెనర్జీకి ఊరట

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీకి సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. కంటి చికిత్స కోసం మూడు వారాలపాటు విదేశాలకు వెళ్లేందుకు సోమవారం అనుమతించింది. ఆయనపై 16 కేసులు పెండింగ్‌లో ఉన్నందున విదేశాలకు వెళ్లి తిరిగి రాకపోవచ్చన్న పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆందోళనను ధర్మాసనం తోసిపుచ్చింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చీ, వి.మోహనలతో కూడిన ధర్మాసనం.. ప్రతి వ్యక్తికీ తనకు నచ్చిన వైద్య చికిత్సను ఎంచుకునే హక్కు ఉందని పేర్కొంది. విదేశీ పర్యటన వివరాలు, బస చేసే ప్రదేశంతో కూడిన ప్రయాణ ప్రణాళికను దర్యాప్తు సంస్థకు అందించాలని బెనర్జీని ఆదేశించింది. కంటి చికిత్స కోసం విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలన్న బెనర్జీ అభ్యర్థనను ఆగస్టు 5న కలకత్తా హైకోర్టు తిరస్కరించింది. వైద్య పరిస్థితిని అంచనా వేసేందుకు ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రి వైద్య బోర్డు ముందు హాజరుకావడానికి ఆయన నిరాకరించడాన్ని హైకోర్టు ప్రస్తావించింది. దీనిపై బెనర్జీ సుప్రీంకోర్టును ఆశ్రయించగా తాజాగా విదేశీ పర్యటనకు అనుమతి లభించింది.

# హసీనాను అప్పగించండి!

## భారత్‌ను మరోసారి కోరిన బంగ్లాదేశ్

**ఢాకా:** మాజీ ప్రధాని షేక్ హసీనాను భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఢాకా మరోసారి కోరింది. భారత హైకమిషనర్ దినేశ్ త్రివేది సోమవారం ప్రధాని తారిఖ్ రహ్మాన్‌తో సమావేశమైన సందర్భంగా ఈ అంశాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ఇరు దేశాల సంబంధాల బలోపేతానికి అనువైన వాతావర ణం అవసరమని రహ్మాన్ పేర్కొన్నారు. హసీనా అప్పగింత ప్రక్రియను భారత్ వేగవంతం చేస్తుందని ఆశిస్తున్నట్లు బంగ్లాదేశ్ ప్రధాని కార్యాలయం తెలిపింది. 2024లో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌కు వచ్చారు. 2025 నవంబర్‌లో బంగ్లాదేశ్ ప్రత్యేక న్యాయస్థానం ఆమెకు గైర్హాజరీలో మరణశిక్ష విధించింది. అప్పటి నుంచి ఆమెను అప్పగించాలని ఢాకా కోరుతోంది.

## ద్వైపాక్షిక అంశాలపై చర్చలు

సుమారు అరగంటపాటు జరిగిన భేటీలో పలు కీలక ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. ప్రధాని మోదీ శుభాకాంక్షలను త్రివేది.. రహ్మాన్‌కు తెలియజేశారు. భారత్–బంగ్లాదేశ్ సంబంధాలను సానుకూల, నిర్మాణాత్మక దిశలో ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. 2025లో హత్యకు గురైన విద్యార్థి నేత ఒస్మాన్ హాది కేసులో నిందితులను కూడా భారత్ నుంచి అప్పగించాలని రహ్మాన్ కోరారు. ఈ కేసులో ముగ్గురు అనుమాని తులను మార్చిలో భారత్‌లో అరెస్టు చేశారు. ప్రస్తుతం వారు పశ్చిమ బెంగాల్‌లో న్యాయస్థాన కస్టడీలో ఉన్నారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యాక వారిని బంగ్లాదేశ్‌కు అప్పగించేందుకు భారత్ అంగీకరించింది.

## బ్రిక్స్ సదస్సుపై ఉత్కంఠ

సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సుకు రహ్మాన్‌ను భారత్ ఆహ్వానించింది. ఆయన హాజరవుతారా.. లేదా అనేదానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. హసీనా అప్పగింత, సరిహద్దు అంశాలు, చైనా వైపు ఢాకా మొగ్గు వంటి పరిణామాలతో ఇరు దేశాల సంబంధాల్లో ఉద్రిక్తత నెలకొంది.

# వాగులో కొట్టుకుపోయిన వ్యాన్

- 9మంది మృతి
- సారంగ్‌పూర్ సమీపంలోని పడానా బైపాస్ వద్ద ఘటన

**రాజ్‌గఢ్ :** భారీ వర్షాలతో ఉప్పొంగిన వాగును దాటేందుకు ప్రయత్నించిన ఓ వ్యాన్ బలమైన నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మృతి చెందారు. మృతుల్లో ఓ బాలిక కూడా ఉంది. మరో ఇద్దరు ప్రయాణికులు ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడ్డారు. ఈ విషాద ఘటన సోమవారం ఉదయం 9 గంటల సమయంలో సారంగ్‌పూర్ సమీపంలోని పడానా బైపాస్ వద్ద చోటుచేసుకుంది. పడానా బైపాస్ కల్వర్టు వద్ద భారీ వర్షాలతో డ్రెయిన్ ఉప్పొంగి ప్రవహిస్తోంది. పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో అక్కడున్న అధికారులు, గ్రామస్థులు వ్యాన్ డ్రైవర్‌ను ముందుకు వెళ్లొద్దని హెచ్చరించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అయినప్పటికీ డ్రైవర్ వాహనాన్ని నీటి ప్రవాహంలోకి తీసుకెళ్లాడు. క్షణాల్లోనే ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు వ్యాన్‌ను తనతో పాటు కొట్టుకుపోయింది. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్థులు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. అయితే తొమ్మిది మంది మృతదేహాలను వెలికితీశారు. మరో ఇద్దరు ప్రయాణికులు ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు.

# మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు!

- గాజా ఒప్పందాన్ని తిరస్కరించిన ఇజ్రాయెల్
- ఎర్ర సముద్రంలో హౌతీల దాడులు
- కీలక రవాణా మార్గాలపై పెరుగుతున్న ఆందోళన

**దుబాయ్:** గాజాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన ఒప్పందాన్ని ఇజ్రాయెల్ తిరస్కరించింది. హమాస్ పూర్తిగా నిరాయుధీకరణ అయ్యే వరకూ గాజా నుంచి తమ సైన్యం వెనక్కి వెళ్లబోదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. మరోవైపు కీలకమైన హర్మూజ్ జలసంధి నిర్వహణపై ఇరాన్, ఒమన్ మధ్య తాత్కాలిక ఒప్పందం దిశగా చర్చలు తుది దశకు చేరుకున్నాయి. అయితే తమను 'శత్రు దేశాలు'గా పరిగణించే దేశాలకు చెందిన నౌకలను జలసంధిలోకి అనుమతించబోమని ఇరాన్ సంకేతాలిచ్చింది. ట్రంప్ ప్రకటించిన 15 అంశాల గాజా ప్రణాళికను ఇజ్రాయెల్ అంగీకరించడం లేదని నెతన్యాహు కేబినెట్ సమావేశంలో స్పష్టం చేశారు. హమాస్ నిరాయుధీకరణ పూర్తయ్యే వరకు గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యాన్ని ఉపసంహరించే ప్రసక్తే లేదన్నారు. ప్రస్తుతం గాజాలో సగానికి పైగా ప్రాంతం ఇజ్రాయెల్ సైన్యం ఆధీనంలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు హమాస్ మధ్యవర్తుల సహకారం, అమెరికా ఒత్తిడి ద్వారా ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది.

## మొఖా పోర్టుపై దాడులు

యెమెన్‌లో ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్ర తీరంలోని ప్రభుత్వ ఆధీనంలోని మొఖా పోర్టుపై దాడులు చేశారు. 24 గంటల వ్యవధిలో ఇది రెండో దాడి కావడం గమనార్హం. క్షిపణులు, డ్రోన్లతో జరిగిన దాడుల్లో కనీసం ఏడుగురు మరణించగా.. 15 మంది పౌరులు గాయపడ్డారు. పోర్టు భవనాలు, రేవులు, వాణిజ్య సరుకులు, ఆహార నిల్వలు దెబ్బతిన్నాయి. సౌదీ అరేబియాలోని జాజాన్‌లో ఉన్న ఆరామ్‌కో రిఫైనరీపై కూడా డ్రోన్ దాడి చేసినట్లు హౌతీలు ప్రకటించారు. ఇదిలాఉంటే హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలంటే అమెరికా తన వైఖరిని మార్చుకోవాలని ఇరాన్ షరతులు విధించింది. అమెరికాతో మధ్యవర్తుల ద్వారా సందేశాల మార్పిడి కొనసాగుతోందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తెలిపారు.

## ఒప్పందం దిశగా ఇరాన్–ఒమన్

హర్మూజ్ జలసంధిపై తాత్కాలిక ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ఇరాన్, ఒమన్ మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఒప్పందం కుదిరితే నౌకలు ఇరాన్ వైపు నుంచి జలసంధిలోకి ప్రవేశించి, ఒమన్ వైపు నుంచి బయటకు వెళ్లే అవకాశం ఉంటుంది. మధ్యంతర కాలంలో ఎలాంటి రుసుములు లేకుండా నౌకల రాకపోకలు సాగించే ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం. అయితే 'శత్రు దేశాల' నౌకలను జలసంధిలోకి అనుమతించబోమని ఇరాన్ పార్లమెంట్ కమిటీ స్పష్టం చేసింది.

## కీలక పదవిలో మార్పు

ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కొత్త అధిపతిగా మాజీ రివల్యూషనరీ గార్డ్ కమాండర్ మొహ్సేన్ రెజాయీని నియమించింది. ఇప్పటివరకు ఆ పదవిలో ఉన్న మహ్మద్ బాఘెర్ జోల్ఘదర్.. సుప్రీం లీడర్ అయతొల్లా మొజ్తబా ఖమేనీకి రాజకీయ సలహాదారుగా బాధ్యతలు చేపట్టనున్నారు.

# జార్ఖండ్‌లో విద్యార్థులపై పోలీసుల చర్య

- అసెంబ్లీ ముట్టడికి ర్యాలీగా బయల్దేరిన నిరసనకారులు
- వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్.. స్వల్ప లాఠీచార్జితో అడ్డుకున్న పోలీసులు
- 17వ రోజుకు చేరిన ఆందోళన



**రాంచీ:** జార్ఖండ్‌లో నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు చేపట్టిన ఆందోళన సోమవారం ఉద్రిక్తంగా మారింది. అసెంబ్లీ వైపు ర్యాలీగా వెళ్తున్న నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. వారిని చెదరగొట్టేందుకు వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్ ప్రయోగించడంతోపాటు స్వల్పంగా లాఠీచార్జి చేశారు. ఈ ఘటనలో 14 మంది పోలీసులకు గాయాలైనట్లు రాంచీ ఎస్పీ రాకేశ్ రంజన్ తెలిపారు. నియామక పరీక్షల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, పరీక్షా విధానంలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారు. సోమవారం పెద్ద సంఖ్యలో విద్యార్థులు అసెంబ్లీ వైపు ర్యాలీగా బయలుదేరడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్ ప్రయోగించారు. అనంతరం స్వల్పంగా లాఠీచార్జి చేసినట్లు అధికారులు తెలిపారు.

## సీసీటీవీతో గుర్తింపు

నిరసన సందర్భంగా శాంతియుత వాతావరణాన్ని భగ్నం చేసేందుకు ప్రయత్నించిన సంఘ విద్రోహ శక్తులను గుర్తించేందుకు ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని విశ్లేషించనున్నట్లు ఎస్పీ రాకేశ్ రంజన్ వెల్లడించారు. ఫుటేజీ ఆధారంగా ఘటనకు కారణమైన వారిని గుర్తించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలాఉంటే నియామక పరీక్షల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, తమ డిమాండ్లను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థులు స్పష్టం చేస్తున్నారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసన సోమవారంతో 17వ రోజుకు చేరింది.

# అఫ్గాన్‌కు ప్రపంచకప్ బెర్త్!

- 2027 వన్డే ప్రపంచకప్‌కు నేరుగా అర్హత

**బెల్‌ఫాస్ట్:** అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్టు 2027 వన్డే ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించింది. ఐర్లాండ్‌తో సోమవారం జరిగిన మూడో వన్డేలో అఫ్గానిస్థాన్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించి ప్రపంచకప్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. తొలుత అఫ్గాన్ బౌలర్లు ఐర్లాండ్‌ను 46.3 ఓవర్లలో 206 పరుగులకు కట్టడి చేశారు. లక్ష్య ఛేదనలో అఫ్గానిస్థాన్ ఒక దశలో 97/2తో పటిష్ఠంగా కనిపించినా.. 176 పరుగులకే 7 వికెట్లు కోల్పోవడంతో ఉత్కంఠ నెలకొంది. కీలక దశలో రషీద్ ఖాన్ జట్టును ఆదుకున్నాడు. 43 బంతుల్లో 4 ఫోర్లతో అజేయంగా 37 పరుగులు చేసి అఫ్గాన్‌ను విజయ తీరాలకు చేర్చాడు. మరో ఎండ్‌లో యామిన్ అహ్మద్‌జాయ్ అతడికి అండగా నిలిచాడు. యామిన్ 26 బంతుల్లో 4 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో అఫ్గానిస్థాన్ 44.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.

### విజయం తప్పనిసరి..

ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించాలంటే అఫ్గానిస్థాన్‌కు ఈ మ్యాచ్‌లో విజయం తప్పనిసరి. ఐర్లాండ్‌పై గెలుపుతో పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానాన్ని నిలబెట్టుకున్న అఫ్గాన్.. నేరుగా ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి వన్డే వర్షం కారణంగా రద్దయింది. రెండో వన్డేలో అఫ్గానిస్థాన్ 92 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. తాజాగా మూడో వన్డేలోనూ విజయం సాధించి ప్రపంచకప్ అర్హతను ఖరారు చేసుకుంది. 2027 ప్రపంచకప్ అఫ్గానిస్థాన్‌కు వన్డే ప్రపంచకప్‌లో నాలుగో ప్రదర్శన కానుంది.

# ప్రపంచకప్ ఫార్మాట్‌పై ఐసీసీకి షాక్!

- 18 నెలల ముందు నిబంధనలు మార్చడంపై స్కాట్లాండ్, నెదర్లాండ్స్ ఆగ్రహం

**దుబాయ్:** వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ ఫార్మాట్, అర్హత విధానంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చేసిన మార్పులపై క్రికెట్ స్కాట్లాండ్, రాయల్ డచ్ క్రికెట్ అసోసియేషన్ (కేఎన్‌సీబీ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ప్రపంచకప్ ప్రారంభానికి 18 నెలల కంటే తక్కువ సమయం మాత్రమే ఉన్న తరుణంలో ఫార్మాట్, అర్హత మార్గంలో కీలక మార్పులు చేయడం అంతర్జాతీయ క్రికెట్ సమగ్రత, విశ్వసనీయతను దెబ్బతీసే ప్రమాదం ఉందని రెండు బోర్డులు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి.

### ఇదీ కొత్త ఫార్మాట్

2027 వన్డే ప్రపంచకప్‌లో మొత్తం 14 జట్లు పాల్గొంటాయి. ర్యాంకింగ్స్‌లో 12, 13, 14 స్థానాల్లో ఉన్న జట్లు ముందుగా అర్హత రౌండ్‌లో తలపడతాయి. ఇందులో విజేతగా నిలిచిన జట్టు మాత్రమే ప్రధాన టోర్నీలోని మిగిలిన 12 జట్లతో కలిసి పోటీపడుతుంది. అనంతరం 12 జట్లను ఆరు చొప్పున రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన దశను నిర్వహిస్తారు. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ప్రపంచకప్‌కు ఆతిథ్యమివ్వనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌ను విస్తరించాల్సిన సమయంలో వర్ధమాన దేశాలకు అంతర్జాతీయ వేదికపై లభించే అవకాశాలను తగ్గించడం సరైన సందేశం కాదని స్కాట్లాండ్, నెదర్లాండ్స్ బోర్డులు పేర్కొన్నాయి. అర్హత మార్గాలు స్పష్టంగా, స్థిరంగా, ముందుగా ఊహించగలిగేలా ఉండాలని కోరాయి.

### స్పందించని ఐసీసీ

ఫార్మాట్ మార్పులపై స్పష్టత కోరుతూ తాము, ఇతర అసోసియేట్ సభ్యులు ఐసీసీతో రెండుసార్లు సమావేశమైనట్లు రెండు బోర్డులు వెల్లడించాయి. అయితే రెండో సమావేశం జరిగి రెండు వారాలకు పైగా గడిచినా ఐసీసీ నుంచి ఎలాంటి తదుపరి స్పందన రాలేదని పేర్కొన్నాయి. ఈ పరిణామం తమను నిరాశకు గురిచేయడంతోపాటు అగౌరవంగా అనిపించిందని వ్యాఖ్యానించాయి. అసోసియేట్ దేశాలతో ఐసీసీ మళ్లీ చర్చలు ప్రారంభించి.. నిర్ణయ ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చాలని స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు డిమాండ్ చేశాయి.

# పావురాలకు నో ఎంట్రీ!

- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు ఇందిరా గాంధీ స్టేడియం ముస్తాబు
- ఇండియా ఓపెన్ అనుభవాలతో ప్రత్యేక చర్యలు
- వెంట్లు మూసివేత.. డబుల్ డోర్ల ఏర్పాటు
- ఈ నెల 17–23 వరకు ప్రపంచ చాంపియన్‌షిప్



**న్యూఢిల్లీ:** భారత్‌లో 17ఏళ్ల తర్వాత జరగనున్న బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. గత జనవరిలో జరిగిన ఇండియా ఓపెన్ సందర్భంగా పావురాల కారణంగా మ్యాచ్‌లు నిలిచిపోవడం, పారిశుద్ధ్యం, కాలుష్యంపై విమర్శలు రావడంతో భారత బ్యాడ్మింటన్ సంఘం (బీఏఐ), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఈసారి పటిష్ఠమైన ముందస్తు చర్యలు చేపట్టాయి. స్టేడియంలోకి పావురాలు, ఇతర కీటకాలు ప్రవేశించకుండా వెంట్లను మూసివేశారు. పాత చెక్క తలుపుల స్థానంలో డబుల్ డోర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. బయటి తలుపు ఆటోమేటిక్‌గా మూసుకునేలా చర్యలు తీసుకున్నారు. అమెరికా నుంచి తెప్పించిన విషరహిత జెల్‌ను డక్టింగ్ చుట్టూ పూయడంతోపాటు.. వేటాడే పక్షుల శబ్దాలను అనుకరించే ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేశారు.

### కోతులు, కుక్కలపైనా నిఘా

స్టేడియం ప్రాంగణంలోకి కోతులు రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీధి కుక్కల నియంత్రణ కోసం ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ)తో సమన్వయం చేస్తున్నట్లు సాయ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంబర్ ప్రతాప్ సింగ్ తెలిపారు. అవసరమైతే కుక్కలను షెల్టర్లకు తరలించే చర్యలు చేపడతామని చెప్పారు.

దశాబ్దాల చరిత్ర ఉన్న స్టేడియానికి నిర్మాణపరంగా, సాంకేతికంగా పలు మార్పులు చేశారు. పైకప్పు మరమ్మతులు, ఎక్స్‌పాన్షన్ జాయింట్ల పనులు పూర్తి చేయడంతోపాటు కుర్చీలకు పాలిషింగ్, భవనాలకు రంగులు వేసే పనులు చేపట్టారు. స్టేడియం ఎదురుగా ఉన్న సరస్సును కూడా అభివృద్ధి చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల్లోనూ పైకప్పు లీకేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

### లైటింగ్, డ్రిఫ్ట్‌పై బీడబ్ల్యూఎఫ్ సంతృప్తి

కోర్టు లైటింగ్, షటిల్ డ్రిఫ్ట్ నియంత్రణకు సంబంధించిన ఏర్పాట్లను బీడబ్ల్యూఎఫ్ నిపుణులు పరిశీలించారు. గత ఇండియా ఓపెన్ సందర్భంగా కనిపించిన నీడల సమస్యను పరిష్కరించినట్లు సాయ్ అధికారులు తెలిపారు. వేదిక పరిస్థితులు, సౌకర్యాలపై బీడబ్ల్యూఎఫ్ నిపుణులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. ఆగస్టు 17 నుంచి 23 వరకు ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ జరగనుంది. భారత్ 17ఏళ్ల తర్వాత ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీకి ఆతిథ్యమివ్వనుంది.

# తొలి రోజే పతకాల పండగ!

- అండర్–23 కామన్వెల్త్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ జోరు
- మొదటిరోజే నాలుగు స్వర్ణాలు.. నాలుగు రజతాలు.. తొమ్మిది కాంస్యాలు
- సాబ్రే, ఫాయిల్, ఏపీ సహా అన్ని విభాగాల్లోనూ పతకాల పంట
- ఆరు వ్యక్తిగత ఈవెంట్లలోనూ భారత ఫెన్సర్లకు పతకాలు



**న్యూఢిల్లీ:** నైజీరియాలోని లాగోస్‌లో జరుగుతున్న యూ–23 కామన్వెల్త్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ అదరగొట్టింది. పోటీలు ప్రారంభమైన తొలి రోజే భారత ఫెన్సర్లు నాలుగు స్వర్ణాలు, నాలుగు రజతాలు, తొమ్మిది కాంస్యాలు.. మొత్తం 17 పతకాలు సాధించి సత్తా చాటారు. సాబ్రే, ఫాయిల్, ఏపీ విభాగాల్లోని మొత్తం ఆరు వ్యక్తిగత ఈవెంట్లలోనూ కనీసం ఒక భారత ఫెన్సర్ పతక వేదికపై నిలవడం విశేషం. పురుషుల సాబ్రే విభాగంలో నిఖిల్ వాఘ్ స్వర్ణ పతకం సాధించగా.. లక్ష్య బాడ్సర్ రజతంతో మెరిశాడు. అశ్విని ఆర్య, లైశ్రామ్ మొరాంబా కాంస్య పతకాలు గెలుచుకున్నారు. పురుషుల ఫాయిల్ విభాగంలో తేజస్ పాటిల్ రజతం సాధించగా.. హేమాష్ సనాసమ్ కాంస్య పతకం దక్కించుకున్నాడు.

### ఏపీలోనూ మెరుపులు

పురుషుల ఏపీ విభాగంలో లోకేశ్ వేం మణి రజత పతకం సాధించాడు. శౌర్య అశ్విని, గాడ్విన్ అంక్‌బెన్ కాంస్య పతకాలు గెలుచుకున్నారు. దీంతో పురుషుల మూడు విభాగాల్లోనూ భారత ఫెన్సర్లు పతకాలు సాధించారు. మహిళల విభాగంలో భారత ఫెన్సర్లు నాలుగు స్వర్ణ పతకాలతో సత్తా చాటారు. ఫాయిల్‌లో జాయిన్ ఆశిత స్వర్ణం సాధించగా.. కనగలక్ష్మి రజతం గెలుచుకుంది. ఏపీ విభాగంలో ప్రాచీ లోహన్ పసిడి పతకం దక్కించుకోగా.. నివేద్యా నాయర్, అనుప్రియ కాంస్యాలు సాధించారు. మహిళల సాబ్రేలో జెఫెర్లిన్ స్వర్ణం గెలుచుకుంది. ఆఖారి రజతం, శ్రేయ గుప్తా కాంస్య పతకాలు సాధించారు. దీంతో మహిళల మూడు విభాగాల్లోనూ భారత్ పతకాలు సాధించింది. భారత ఫెన్సింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజీవ్ మెహతా భారత బృందం ప్రదర్శనపై హర్షం వ్యక్తం చేశారు. పతక విజేతలు, కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యుల కృషిని అభినందించారు. క్రీడాకారుల

# రెండు రజతాలు.. ఓ కాంస్యం

- ప్రపంచ అండర్–20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ముగిసిన భారత పోరాటం
- హైజంప్‌లో పూజా సింగ్‌కు ఏడో స్థానం
- 1.84 మీటర్లకే పరిమితం.. 1.87 మీటర్ల వద్ద మూడు ప్రయత్నాల్లో విఫలం
- 4×400 మీటర్ల రిలేలో తొమ్మిదో స్థానం

**యూజీన్ (అమెరికా):** ప్రపంచ అండర్–20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ మూడు పతకాలతో తన ప్రస్థానాన్ని ముగించింది. జాతీయ సీనియర్ రికార్డు హోల్డర్ పూజా సింగ్ మహిళల హైజంప్ ఫైనల్లో అంచనాలను అందుకోలేక ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. మరోవైపు మహిళల 4×400 మీటర్ల రిలే జట్టు ఫైనల్లో తొమ్మిదో స్థానంలో నిలిచింది. 19ఏళ్ల పూజా సింగ్ హైజంప్ ఫైనల్లో 1.84 మీటర్ల ఎత్తును మాత్రమే అధిగమించింది. 1.87 మీటర్ల వద్ద చేసిన మూడు ప్రయత్నాల్లోనూ విఫలమైంది. పూజా పేరిట 1.93 మీటర్ల జాతీయ సీనియర్ రికార్డు ఉంది. ఈ ఏడాది మేలో జరిగిన ఆసియా అండర్–20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 1.93 మీటర్లు ఎగిరి స్వర్ణం సాధించిన ఆమె.. సీనియర్ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లోనూ పసిడి పతకం గెలుచుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన ఇజొబెల్ లూయిసన్–రో 1.92 మీటర్లతో స్వర్ణ పతకం సాధించింది. హంగేరీకి చెందిన లిలియానా బటోరి, స్పెయిన్‌కు చెందిన ఐతానా అలోన్సో 1.90 మీటర్లతో వరుసగా రజతం, కాంస్యం గెలుచుకున్నారు. భూమిక నెహతే, తహూరా ఖతూన్, తనూ చౌధరి, థియా అరుముగం సభ్యులుగా ఉన్న భారత మహిళల 4×400 మీటర్ల రిలే జట్టు 3:45.28 నిమిషాల్లో గమ్యాన్ని చేరి తొమ్మిదో, చివరి స్థానంలో నిలిచింది. అమెరికా 3:29.15 నిమిషాల్లో రేసును పూర్తి చేసి స్వర్ణం సాధించగా.. ఆస్ట్రేలియా 3:31.39తో రజతం, బ్రిటన్ 3:32.08తో కాంస్యం గెలుచుకున్నాయి.




# మిల్కీ మిస్ట్ ఐపీఓకు భారీ స్పందన

- యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.465.30 కోట్ల సమీకరణ
- ఐపీఓలో ఒక్కో షేరు ధర రూ.133–140.. ఆగస్టు 11న ప్రారంభం
- దేశీయ డెయిరీ కంపెనీల్లో అతిపెద్ద ఐపీఓగా రికార్డు

**న్యూఢిల్లీ:** ప్యాకేజ్డ్ ఫుడ్ సంస్థ మిల్కీ మిస్ట్ డెయిరీ ఫుడ్ లిమిటెడ్ యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.465.30 కోట్లను సమీకరించింది. ప్రజల కోసం ఐపీఓ ప్రారంభానికి ఒకరోజు ముందు ఈ నిధులను సమీకరించింది. రూ.140 చొప్పున 3.32 కోట్ల ఈక్విటీ షేర్లను యాంకర్ ఇన్వెస్టర్లకు కేటాయించినట్లు బీఎస్ఈలో దాఖలు చేసిన పత్రాల్లో వెల్లడించింది. మిల్కీ మిస్ట్ ఐపీఓ ఆగస్టు 11న ప్రారంభమై 13న ముగియనుంది. ఒక్కో షేరు ధరను రూ.133–140గా నిర్ణయించారు. మొత్తం రూ.1,553 కోట్ల సమీకరణ లక్ష్యంగా పెట్టుకున్న ఈ ఇష్యూలో రూ.1,428 కోట్ల తాజా షేర్ల జారీ, రూ.125 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ఉంది. ఈ ఐపీఓ భారత డెయిరీ రంగంలో ఇప్పటివరకు అతిపెద్దదిగా నిలవనుంది.

### తయారీ విస్తరణకు నిధులు

తాజా షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధులను రుణాల చెల్లింపు, తమిళనాడులోని పెరుందురై తయారీ కేంద్రం విస్తరణ, ఆధునీకరణ, కోల్డ్‌చైన్ మౌలిక వసతుల బలోపేతానికి వినియోగించనున్నారు. వెయ్ ప్రోటీన్ కాన్సంట్రేట్, యోగర్ట్, క్రీమ్ చీజ్ ప్లాంట్ల ఏర్పాటుతోపాటు వివిధ కూలింగ్ పరికరాల ఏర్పాటుకూ నిధులు కేటాయించనున్నారు. ఈరోడ్ కేంద్రంగా పనిచేస్తున్న మిల్కీ మిస్ట్ పనీర్, చీజ్, పెరుగు, యోగర్ట్, వెన్న, నెయ్యి, ఐస్‌క్రీమ్ తదితర విలువ ఆధారిత డెయిరీ ఉత్పత్తులను విక్రయిస్తోంది. కంపెనీ షేర్లు ఆగస్టు 18న బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ కానున్నాయి.

# టీసీఎస్‌కు డేటా లీక్ ముప్పు!

- లీక్ ముప్పు సమాచారం పాతదేనని వెల్లడి

**ముంబై:** దేశంలోని అతిపెద్ద ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు ఉద్యోగుల డేటా లీక్‌కు సంబంధించిన ముప్పు హెచ్చరికలు అందాయి. కొంత మంది ఉద్యోగులకు సంబంధించిన సమాచారాన్ని బయటకు తీసే అవకాశం ఉందంటూ థ్రెట్ ఇంటెలిజెన్స్ అలర్ట్‌లు వచ్చినట్లు టీసీఎస్ సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. అయితే కస్టమర్ల డేటా, కస్టమర్ సిస్టమ్స్, సంస్థ కార్యకలాపాలకు సంబంధించిన సిస్టమ్స్‌పై ఎలాంటి ప్రభావం కనిపించలేదని స్పష్టం చేసింది. లీక్ అయ్యే అవకాశం ఉన్నట్లు గుర్తించిన సమాచారం నాలుగేళ్లకు పైగా పాతదని టీసీఎస్ తెలిపింది. అందులో ఉద్యోగులకు సంబంధించిన ప్రాథమిక వివరాలు మాత్రమే ఉన్నాయని పేర్కొంది. పాస్‌వర్డ్ స్ప్రే, మల్టీ–ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ (ఎంఎఫ్ఏ) ఫటీగ్ వంటి పద్ధతులను ఉపయోగించి దాడికి పాల్పడినట్లు దాడిదారులు పేర్కొన్నారని వెల్లడించింది. ఇలాంటి ముప్పులను ఎదుర్కొనేందుకు టీసీఎస్ భద్రతా నియంత్రణలను గత రెండేళ్లుగా మరింత పటిష్ఠం చేసినట్లు సంస్థ తెలిపింది.

# 100 గ్రామాలకు ఐటీసీ అండ!

- తొమ్మిది జిల్లాల్లో సమగ్ర అభివృద్ధికి సంస్థ కీలక భాగస్వామ్యం
- 15 గ్రామాలను 'పీ4 లైట్‌హౌస్ విలేజెస్'గా తీర్చిదిద్దనున్న ఐటీసీ
- ఉపాధి, వ్యవసాయం, విద్య, నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం
- 'స్వర్ణాంధ్ర@2047' లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలు




**ప్రజానావ, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర గ్రామీణాభివృద్ధికి ఐటీసీ లిమిటెడ్ ముందుకొచ్చింది. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో 100 గ్రామాలను దత్తత తీసుకుని వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ (ఎస్ఏపీఎఫ్)తో సోమవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా 15 గ్రామాలను 'పీ4 లైట్‌హౌస్ విలేజెస్'గా అభివృద్ధి చేసి.. సమగ్ర గ్రామీణాభివృద్ధికి నమూనా గ్రామాలుగా తీర్చిదిద్దనున్నారు. ఐటీసీ భాగస్వామ్యంతో గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంచడంతోపాటు 'బంగారు కుటుంబాల' ఆర్థిక సాధికారతకు చర్యలు చేపట్టనున్నారు. వ్యవసాయం, నైపుణ్య శిక్షణ, మహిళా సాధికారత, నీటి భద్రత, విద్య, వ్యర్థాల నిర్వహణ తదితర రంగాల్లో కార్యక్రమాలను అమలు చేయనున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఈ కార్యక్రమాలను అనుసంధానం చేయనున్నారు. 'స్వర్ణాంధ్ర@2047' లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి చేసిన నమూనాలను ఇతర గ్రామాల్లోనూ అమలు చేసేలా ప్రణాళిక రూపొందించారు. గ్రామాల స్థానిక అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నారు.

### పేదరిక నిర్మూలనే లక్ష్యం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన 'జీరో పావర్టీ పీ4' కార్యక్రమంలో భాగంగానే ఐటీసీ–ఎస్ఏపీఎఫ్ భాగస్వామ్యం ఏర్పడింది. పబ్లిక్–ప్రైవేట్–పీపుల్ పార్ట్‌నర్‌షిప్ (పీ4) విధానంలో సమాజంలోని ఆర్థికంగా బలమైన 10 శాతం మంది.. దిగువ 20 శాతం కుటుంబాలకు మార్గదర్శకులుగా నిలవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. వారికి ఆర్థిక, సామాజిక సాధికారత కల్పించి పేదరికం నుంచి బయటకు తీసుకురావడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన అభివృద్ధిని సాధించడమే పీ4 లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంటోంది.



# జీఈఎంలో రక్షణ కొనుగోళ్ల జోరు!

- రూ.1.35 లక్షల కోట్లను దాటిన రక్షణ రంగ ఆర్డర్లు
- మొత్తం కొనుగోళ్లలో 15 శాతం వాటా
- పదేళ్లలో రూ.20 లక్షల కోట్లకు పైగా లావాదేవీలు
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ ఈ–మార్కెట్‌ప్లేస్ (జీఈఎం)లో రక్షణ రంగ కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయి. మిలిటరీ అఫైర్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా జీఈఎంలో నమోదైన రక్షణ రంగ ఆర్డర్ల విలువ రూ.1.35 లక్షల కోట్లను దాటిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. జీఈఎం ద్వారా జరుగుతున్న మొత్తం ప్రభుత్వ కొనుగోళ్లలో రక్షణ రంగం వాటా దాదాపు 15 శాతం ఉందని వెల్లడించారు. జీఈఎం పదో వార్షికోత్సవ కార్యక్రమంలో పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు ఏటా రూ.5 లక్షల కోట్లకు పైగా విలువైన వస్తువులు, సేవలను ఈ పోర్టల్ ద్వారా కొనుగోలు చేస్తున్నాయని తెలిపారు. గత పదేళ్లలో జీఈఎం ద్వారా రూ.20 లక్షల కోట్లకు పైగా విలువైన కొనుగోళ్లు జరిగినట్లు వెల్లడించారు. ప్రభుత్వ కొనుగోళ్లలో పారదర్శకతను పెంచడంతోపాటు చిన్న, మధ్య తరహా విక్రేతలకు కూడా మార్కెట్ అవకాశాలను జీఈఎం కల్పిస్తోందని పేర్కొన్నారు. ఐఐటీ ఢిల్లీ నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. మూడేళ్ల వ్యవధిలో జీఈఎం ద్వారా ప్రభుత్వానికి అంచనా రూ.86,571 కోట్ల మేర వ్యయం ఆదా అయినట్లు గోయల్ తెలిపారు. జీఈఎంలో నమోదైన 101 వస్తువుల ధరలను వాణిజ్య ఈ–కామర్స్ సంస్థల ధరలతో పోల్చగా.. సగటున 74 శాతం తక్కువగా ఉన్నట్లు మరో అధ్యయనం వెల్లడించిందని చెప్పారు.

# స్వల్ప లాభాల్లో స్టాక్ మార్కెట్లు!

- 43 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. 13 పాయింట్లు లాభపడ్డ నిఫ్టీ
- మధ్యప్రాచ్య ఉద్రిక్తతలతో పెరిగిన ముడిచమురు ధరలు
- బ్రెంట్ క్రూడ్ 1.10 శాతం పెరిగి 84.47 డాలర్లకు చేరిక
- టైటాన్, బజాజ్ ఫైనాన్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు
- నష్టాల్లో ఎస్‌బీఐ, ఎన్‌టీపీసీ, ఐటీసీ, టీసీఎస్



**ముంబై:** అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడం, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో సూచీలు పరిమిత స్థాయిలోనే కదలాడాయి. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 43.27 పాయింట్లు (0.06 శాతం) లాభపడి 78,542.44 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 13.15 పాయింట్లు (0.05 శాతం) పెరిగి 24,583.80 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ప్యాక్‌లో టైటాన్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్ షేర్లు లాభాల్లో ముగిశాయి. మరోవైపు ఎస్‌బీఐ, ఎటర్నల్, ఎన్‌టీపీసీ, ఐటీసీ, టీసీఎస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిణామాలు, హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అంశంపై కొనసాగుతున్న అనిశ్చితి అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై ప్రభావం చూపింది. బ్రెంట్ క్రూడ్ ధర 1.10 శాతం పెరిగి బ్యారెల్‌కు 84.47 డాలర్లకు చేరింది. ముడిచమురు ధరల పెరుగుదలతో మదుపర్లు భారీగా రిస్క్ తీసుకునేందుకు వెనుకంజ వేశారు. రంగాల వారీగా రియల్టీ సూచీ 1.60 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 1.21 శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.47 శాతం, ఐటీ సూచీ 0.22 శాతం లాభపడ్డాయి. మరోవైపు పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 1.30 శాతం క్షీణించింది.

# తగ్గిన వోడాఫోన్ ఐడియా నష్టాలు

- త్రైమాసిక నష్టం రూ.3,754 కోట్లు.. గతేడాది రూ.6,611 కోట్లు
- ఆదాయం 6 శాతం పెరుగుదల, ఏఆర్‌పీయూ 10.2 శాతం వృద్ధి



**న్యూఢిల్లీ:** రుణభారంతో ఉన్న వోడాఫోన్ ఐడియా (వీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో నష్టాలను తగ్గించుకుంది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.3,754 కోట్ల నికర నష్టం నమోదు చేసింది. గతేడాది ఇదే కాలంలో నష్టం రూ.6,611 కోట్లు. ప్రభుత్వ బకాయిలకు లభించిన వెసులుబాటు, ప్రమోటర్ గ్రూప్ కేటాయించిన షేర్ల విలువ పెరగడం ఇందుకు ప్రధాన కారణాలు. కంపెనీ కార్యకలాపాల ఆదాయం 6 శాతం పెరిగి రూ.11,689 కోట్లకు చేరింది. కస్టమర్ల సగటు ఆదాయం (ఏఆర్ పీయూ) 10.2 శాతం పెరిగి రూ.195కు చేరింది. మొత్తం చందాదారుల సంఖ్య 19.31 కోట్లకు తగ్గినా.. 4జీ, 5జీ వినియోగదారులు 13కోట్లకు పెరిగారు.

## 'స్పైడర్‌మ్యాన్' VS 'ది ఒడిస్సీ'

# బిలియన్ డాలర్ వార్!





'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' వర్సెస్ 'ది ఒడిస్సీ'.. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ రెండు సినిమాల పేర్లతో హ్యాష్‌ట్యాగ్ వార్ నడుస్తోంది. అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధ సమయంలో ఆయా దేశాలకు సంబంధించిన హ్యాష్‌ట్యాగ్‌లు ఎంతగా ట్రెండ్ అయ్యాయో, ఇప్పుడు ఈ రెండు సినిమాల హ్యాష్‌ట్యాగ్‌లు కూడా అంతే స్థాయిలో హల్‌చల్ చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఈ రెండు చిత్రాలపై ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న క్రేజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఇదే నిదర్శనం. జూలై 17న 'ది ఒడిస్సీ', జూలై 31న 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ప్రేక్షకుల ముందుకు రావడంతో ప్రపంచ సినీ ప్రేమికులకు జూలై నెల ఓ ప్రత్యేకమైన సినిమాటిక్ ఫీస్ట్‌గా మారింది. ఇప్పుడు ఈ రెండు భారీ చిత్రాల మధ్య బాక్సాఫీస్ వసూళ్ల విషయంలో సాగుతున్న పోరు అంతర్జాతీయ సినీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా బిలియన్ డాలర్ మార్క్ చుట్టూ ఈ రెండు సినిమాల ప్రభావం ఎలా ఉండబోతోందన్నదే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' బాక్సాఫీస్ వద్ద అసాధారణమైన వేగంతో దూసుకుపోతోంది. విడుదలైన తొలి వారంలోనే ఉత్తర అమెరికా మార్కెట్‌లో ఏకంగా 500 మిలియన్ డాలర్ల మైలురాయిని దాటేసి సంచలనం సృష్టించింది. భారతీయ కరెన్సీలో ఈ మొత్తం సుమారు రూ.4,700 కోట్లకు పైమాటే. గతంలో 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' ఎనిమిది రోజుల్లో సాధించిన ఈ భారీ మైలురాయిని 'స్పైడర్‌మ్యాన్' కేవలం ఏడు రోజుల్లోనే అధిగమించిందనే ప్రచారం సినిమాపై ఉన్న హైప్‌ను మరింత పెంచింది. కేవలం ఉత్తర అమెరికాకే పరిమితం కాకుండా అంతర్జాతీయ మార్కెట్లలోనూ స్పైడర్‌మ్యాన్ ప్రభంజనం కొనసాగుతోంది. విడుదలైన ఆరు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి అడుగుపెట్టిన ఈ చిత్రం.. తొలి వారం పూర్తయ్యేసరికి అంతర్జాతీయ మార్కెట్ల నుంచి 808 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల అంచనా. దీంతో మొదటి వారానికే ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు 1.31 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. భారతీయ కరెన్సీలో ఇది దాదాపు రూ.12,300 కోట్లకు సమానం. రెండో వారంలోనూ సినిమా జోరు ఏమాత్రం తగ్గకపోవడంతో రాబోయే రోజుల్లో 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ప్రపంచవ్యాప్త వసూళ్లు 1.66 బిలియన్ డాలర్ల వరకు చేరే అవకాశముందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంటే భారతీయ కరెన్సీలో దాదాపు రూ.15,600 కోట్లకు చేరే అవకాశం ఉందన్నమాట. ఇదే ఊపు కొనసాగితే గతంలో భారీ వసూళ్లు సాధించిన హాలీవుడ్ చిత్రాల రికార్డులకు ఈ సినిమా మరింత చేరువయ్యే అవకాశం ఉంది. భారతీయ మార్కెట్‌లోనూ 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' తన సత్తా చాటుతోంది. తొలి వారంలోనే 44 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసిందని, అంటే సుమారు రూ.420 కోట్లకు పైగా రాబట్టిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ భారీ వసూళ్లతో భారత్‌లో అత్యధిక కలెక్షన్లు సాధించిన హాలీవుడ్ సినిమాల జాబితాలో 'స్పైడర్‌మ్యాన్' మూడో స్థానానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇదే జోరు కొనసాగితే 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' రికార్డులను అందుకోవడంతో పాటు 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' వసూళ్లపై కూడా కన్నేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక మరోవైపు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన 'ది ఒడిస్సీ' కూడా ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. హోమర్ మహాకావ్యం ఆధారంగా తెరకెక్కిన ఈ విజువల్ వండర్‌పై విడుదలకు ముందే భారీ హైప్ నెలకొంది. నోలన్ మేకింగ్, భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలు ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో 'ది ఒడిస్సీ' కూడా బాక్సాఫీస్ వద్ద తనదైన ప్రభంజనం సృష్టిస్తోంది. ఒకవైపు సూపర్‌హీరో ప్రపంచాన్ని ప్రతిబింబించే 'స్పైడర్‌మ్యాన్', మరోవైపు మహాకావ్యాన్ని ఆధునిక విజువల్ ట్రీట్‌గా ఆవిష్కరించిన 'ది ఒడిస్సీ'.. ఈ రెండు సినిమాలు ఒకేసారి ప్రపంచ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం విశేషం. మొత్తంగా చూస్తే.. 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' వర్సెస్ 'ది ఒడిస్సీ' పోరు కేవలం రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీగా మాత్రమే కాకుండా.. రెండు భారీ సినీ ప్రపంచాల మధ్య జరుగుతున్న ఆసక్తికరమైన వార్‌గా మారింది. సోషల్ మీడియా నుంచి బాక్సాఫీస్ వరకు ఈ రెండు చిత్రాల పేర్లే మార్మోగుతుండటంతో.. చివరకు ఏ సినిమా వసూళ్లలో పైచేయి సాధిస్తుందన్న ఆసక్తి ప్రపంచ సినీ అభిమానుల్లో రోజురోజుకూ పెరుగుతోంది.

## మీనాక్షి ఖాతాలో

# మరో క్రేజీ ప్రాజెక్ట్!



'సంక్రాంతికి వస్తున్నాం', 'అనగనగా ఒక రాజు' చిత్రాలతో వరుస విజయాలను అందుకుని టాలీవుడ్‌లో జోరుమీదున్న అందాల భామ మీనాక్షి చౌదరి. వరుస అవకాశాలతో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే వెండితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మీనాక్షి.. ఇక డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. తెలుగులో తన తొలి వెబ్‌సిరీస్‌లో నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం నాగచైతన్యతో 'వృషకర్మ'లో నటిస్తున్న మీనాక్షి.. మరోవైపు దర్శకుడు కల్యాణ్ శంకర్ తెరకెక్కిస్తున్న చిత్రంలో తమిళ హీరో కార్తితో కలిసి నటిస్తోంది. ఇలా వరుస సినిమాలతో బిజీగా ఉన్న సమయంలోనే ఆమె ఖాతాలోకి మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరడం విశేషం. ఇక సిద్ధు జొన్నలగడ్డ హీరోగా దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న వెబ్‌సిరీస్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సిరీస్‌లో మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నట్లు దర్శకుడు వెంకీ అట్లూరి తాజాగా స్పష్టత ఇచ్చారు. ఇప్పటివరకు సినిమాల్లో గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రల్లో మెప్పించిన మీనాక్షి.. ఈ సిరీస్‌లో ఎలాంటి పాత్రలో కనిపించబోతోందనేది ఆసక్తికరంగా మారింది. సిద్ధు జొన్నలగడ్డతో ఆమె కెమిస్ట్రీ ఎలా ఉండబోతోందన్నది కూడా ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఇప్పటికే ఈ వెబ్‌సిరీస్ చిత్రీకరణ కూడా ప్రారంభమైనట్లు దర్శకుడు వెల్లడించారు. సినిమాలతో పోలిస్తే వెబ్‌సిరీస్ కథనానికి మరింత విస్తృతమైన స్పేస్ ఉండటంతో మీనాక్షి పాత్రకు కూడా మంచి ప్రాధాన్యం ఉంటుందని తెలుస్తోంది. ఈ సిరీస్‌ను ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చే ఏడాది ప్రథమార్ధంలో స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చే అవకాశముంది. అయితే విడుదల తేదీ, కథ, మీనాక్షి పాత్ర స్వభావం, ఇతర నటీనటుల వివరాలను మాత్రం మేకర్స్ ఇంకా అధికారికంగా వెల్లడించలేదు.

## కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణేశ్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో డా 'కొరియన్ కనకరాజు' మంచి జోరు చూపించింది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో కలిపి 2.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం వెల్లడించింది. తొలి రోజు వసూళ్లతో పాటు సినిమాకు వస్తున్న మౌత్ టాక్ డా పాజిటివ్‌గా ఉండటం మేకర్స్‌కు మరింత కలిసొచ్చే అంశంగా మారింది.

## త్రివిక్రమ్‌తో మా బంధం బలమైనది

ఒక బ్యానర్‌లో పనిచేసే వ్యక్తుల మధ్య మంచి అనుబంధం ఏర్పడితే.. అదే బంధం కొనసాగుతుందని, దానికి ప్రత్యేకమైన అగ్రిమెంట్లు అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాగవంశీ.. నిర్మాతల కాంపౌండ్స్, దర్శకుడు త్రివిక్రమ్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వారి కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి నాగవంశీ మాట్లాడుతూ.. తన బాబాయి (చిన్నబాబు) ఇండస్ట్రీలోకి రావాలని అనుకున్న సమయంలో తొలి సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలోనే చేయాలని కోరుకున్నారని తెలిపారు. త్రివిక్రమ్ పనితీరు, సినిమాలపై ఆయనకు ఉన్న అభిమానం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆ సమయంలో 'జులాయి' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి త్రివిక్రమ్‌తో తమ అనుబంధం మరింత బలపడిందని నాగవంశీ పేర్కొన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' అనే బ్యానర్ పేరును డా త్రివిక్రమే సూచించారని, ఆ బ్యానర్ లోగోను సైతం ఆయనే డిజైన్ చేశారని వెల్లడించారు. 'అప్పటి నుంచి ఇప్పటివరకు త్రివిక్రమ్ బయట బ్యానర్‌లో సినిమా చేయలేదు. దీనికి ఎలాంటి అగ్రిమెంట్లు లేవు. మా మధ్య ఉన్న రిలేషన్‌షిప్ అలాంటిది. ఒక ఫ్యామిలీలా అయిపోయాం' అని నాగవంశీ చెప్పుకొచ్చారు. త్రివిక్రమ్ తమ బ్యానర్‌తోనే వరుసగా సినిమాలు చేస్తూ ప్రయాణం కొనసాగిస్తున్న నేపథ్యంలో.. తమ వైపు నుంచి డా ఆయనకు ఎక్స్‌క్లూజివిటీ ఇవ్వడం సహజమేనని నాగవంశీ అన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' బ్యానర్‌ను ప్రధానంగా త్రివిక్రమ్ సినిమాల కోసం కొనసాగిస్తున్నట్లు వివరించారు. అయితే త్రివిక్రమ్‌కు ఆ బ్యానర్‌లో వాటా ఉందనే ప్రచారంపై డా నాగవంశీ క్లారిటీ ఇచ్చారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌లో త్రివిక్రమ్‌కు ఎలాంటి షేర్ లేదని, ఆయనకు రెమ్యునరేషన్ మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఆయనకు సంబంధించిన షేర్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ఉంటుందని తెలిపారు. అలాగే సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో త్రివిక్రమ్ కీలకంగా భాగస్వామ్యం అవుతున్నారని, స్క్రిప్టులు, ఇతర సినిమా విషయాల్లో ఆయన సలహాలు డా తీసుకుంటామని నాగవంశీ వెల్లడించారు. త్రివిక్రమ్‌తో తమ బంధం వలం సినిమాలకు సంబంధించినది మాత్రమే కాదని.. సంవత్సరాలుగా కొనసాగుతున్న అనుబంధమే తమ ప్రయాణానికి కారణమని నాగవంశీ చెప్పుకొచ్చారు.

## టాక్సిక్ కోసం నయన్..

# ఆ ఒక్క కాల్‌తో!



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'టాక్సిక్' ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'కేజీఎఫ్' తర్వాత రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించారు. విడుదలకు సమయం దగ్గరపడటంతో మేకర్స్ ప్రమోషన్స్ వేగం పెంచి తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో లేడీ సూపర్‌స్టార్ నయనతార పాల్గొనడం హాట్‌టాపిక్‌గా మారింది. సాధారణంగా సినిమా ప్రమోషన్స్, ఈవెంట్లకు దూరంగా ఉండే నయన్.. 'టాక్సిక్' కార్యక్రమానికి రావడానికి గల కారణాన్ని స్వయంగా వెల్లడించారు. 'నాకు ఈవెంట్లలో మాట్లాడటం సరిగ్గా రాదు. అందుకే ఇలాంటి కార్యక్రమాలకు దూరంగా ఉంటాను. కానీ 'టాక్సిక్' నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఈ ఈవెంట్‌కు రావడానికి ప్రధాన కారణం యష్. ఆయన ఒక్క ఫోన్ కాల్ చేసి ఆహ్వానించారు. ఆయన మాట కోసం ఇక్కడికి వచ్చాను' అని నయనతార తెలిపారు. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ మేకింగ్, కథను చెప్పిన విధానం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని, సెట్స్‌లో నటీనటులను ఆమె చూసుకున్న తీరు అద్భుతంగా ఉందని ప్రశంసించారు. తనతో కలిసి నటించిన కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా నటనను కూడా నయన్ ప్రత్యేకంగా అభినందించారు. ఇక యష్ గురించి మాట్లాడిన సమయంలో నయనతార భావోద్వేగానికి గురయ్యారు. 'నా కెరీర్‌లో ఎంతోమంది సూపర్‌స్టార్లతో పనిచేశాను. కానీ యష్ అంత కష్టపడే నటుడిని ఎక్కడా చూడలేదు. ఈ సినిమా కోసం ఆయన దాదాపు నాలుగున్నరేళ్ల సమయాన్ని కేటాయించారు. వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబంతో గడిపే సమయాన్ని కూడా త్యాగం చేశారు. ఆయన కష్టానికి భార్య రాధిక అందించిన సహకారం ఎంతో గొప్పది. యష్‌తో కలిసి పనిచేయడం నాకు చాలా ఆనందంగా ఉంది' అని నయనతార చెప్పుకొచ్చారు. ప్రస్తుతం నయన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## 12న ఇరుముడి

# ట్రైలర్ విడుదలకు సన్నాహాలు



మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటి ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటి 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ డా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.